నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 26-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:210 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

ఎన్నో గతులుగ ప్రజలకు
మిన్నగ సేవల నొసగెడి మెట్రో పనులన్
తిన్నగ ప్రారంభించిరి
యున్నత లక్ష్యములతోడ నుత్సాహముతోన్ !

(26-4-2012 హైదరాబాద్ లో మెట్రో పనులు ప్రారంభం అయిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

దృక్పథాల మార్పులతో
దునియా ముందుకెళ్తుంది
ఆధునికత వద్దంటే
అభివృద్ధి ఆగిపోతుంది
మడిగట్టుకు గతంలోనే
మసిలిపోతే పరుగులేదు
దడిగట్టుకు భయంతోనే
దగాపడితే మెరుగులేదు

-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2025

-హైదరాబాద్ వేదికగా రెండు రోజుల పాటు సదస్సు
-వంద దేశాల నుంచి ప్రతినిధులు రాక
-సమిట్ లో పాల్గొంటున్న 450 మంది ప్రముఖులు
-పెట్టుబడి అవకాశాలను వివరించనున్న రేవంత్
-సమ్మిట్ కు రానున్న మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ

హైదరాబాద్, ఏప్రిల్ 25: పెట్టుబడులు, న్యాయం, ప్రపంచ శాంతి, అహింస అనే మహత్తర లక్ష్యాలతో ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్ - 2025 నేడు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ), నోవాటెల్‌లో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అపూర్వ స్వాగతం లభించింది.

కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సాంప్రదాయబద్ధమైన బోనాలు, డప్పు చప్పుళ్లతో వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేసే ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ సందర్శకులకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించనుంది.

ఈ అత్యంత ముఖ్యమైన సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొననున్నారు. అంతేకాకుండా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)కి చెందిన అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ వంటి ప్రముఖులు కూడా ఈ సదస్సులో పాల్గొని తమ విలువైన అభిప్రాయాలను పంచుకోనున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో న్యాయం, శాంతిని నెలకొల్పడం, అహింసా మార్గాన్ని ప్రోత్సహించడం ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశాలు. రానున్న రెండు రోజుల్లో వివిధ దేశాల ప్రతినిధులు పెట్టుబడుల అవకాశాలు, అంతర్జాతీయ సంబంధాలు, శాంతి స్థాపన వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరపనున్నారు. ఈ సమ్మిట్ ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాముఖ్యతను మరింతగా చాటిచెబుతుందని భావిస్తున్నారు.

ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ కన్నుమూత

బెంగళూరు ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్(84) కన్నుమూశారు. బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు కృష్ణస్వామి కస్తూరి రంగన్. కేరళలోని ఎర్నాకులంలో ఆయన జన్మించారు. ముంబై యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసిన రంగన్.. అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ నుంచి 1971లో డాక్టరేట్ అందుకున్నారు. 990 నుంచి 1994 వరకూ ఆయన యూఆర్ఎసి డైరెక్టర్‌గా పని చేశారు. 1994 నుంచి 2003 వరకూ తొమ్మిదేళ్ల పాటు భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఛైర్మన్‌గా సేవలు అందించారు. జెఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003-2009 వరకూ ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. దీంతో పాటు మోదీ సర్కార్ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా రంగన్ పని చేశారు. ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణన్ మీద దేశద్రోహం ఆరోపణలు వచ్చినప్పుడు ఇస్రో ఛైర్మన్‌గా ఉంది కస్తూరి రంగనే. 1969లో ఆయన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం.

ఉగ్రదాడిని సమర్థించిన ఎమ్మెల్యే అరెస్ట్ ..

గౌహతి, ఏప్రిల్ 25: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌ను సమర్థించారనే ఆరోపణలపై అసోం పోలీసులు ప్రతిపక్ష ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాంను దేశద్రోహం ఆరోపణలపై అరెస్టు చేశారు . డింగ్ నియోజకవర్గం నుండి మూడుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైన ఇస్లాంను నాగావ్ జిల్లాలోని తన నివాసంలో అరెస్టు చేశారు. కాగా ఏఐయూడీఎఫ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆ అభిప్రాయాలు ఆయన సొంత అభిప్రాయాలే తప్ప పార్టీవి కావు అని పేర్కొంది.

"ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిపై ఢింగ్ ఎమ్మెల్యే ఇస్లాం చాలా తప్పుడు ప్రకటన" చేస్తున్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోను పోలీసులు గమనించారని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) స్వప్ననీల్ దేకా తెలిపారు. ఎమ్మెల్యే ఉగ్రవాదులను ఎలా సమర్థిస్తున్నారో గమనించిన అస్సాం పోలీసులు, తప్పుదారి పట్టించే, రెచ్చగొట్టే ప్రకటనలను వ్యాప్తి చేసినందుకు భారతీయ న్యాయ సంహితలోని 152, 196, 197(1), 113(3), 352, 353 సెక్షన్ల కింద అతనిపై కేసు నమోదు చేశారు. అతన్ని అరెస్టు చేశామని, నేడు కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ తెలిపారు.

కస్తూరి రంగన్ సేవలు చిరస్మరణీయం.. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 25:-ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్‌గా, ముఖ్యంగా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో వారు పోషించిన పాత్ర దేశం మరిచిపోదని అన్నారు. ఈ మేరకు ఆయన తన అధికారికి ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు. రాజ్యసభ సభ్యుడిగా, జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్‌గా, కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా, ఖగోళ శాస్త్రవేత్తగా విశేష సేవలు అందించిన ఒక గొప్ప వ్యక్తిని దేశం కోల్పో యిందని పేర్కొన్నారు. డాక్టర్ కస్తూరి రంగన్ మరణం దేశానికి తీరనిలోటు అని అన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. వారి కుటుం బ సభ్యులకు ముఖ్యమంత్రి తమ సానుభూతిని తెలియజేశారు.

గడువు తరువాత ఏ పాకిస్తానీని దేశంలో ఉండనివ్వకండి

-సిఎంలు అందరికీ ఫోన్‌లో అమిత్ షా పిలుపు

న్యూఢిల్లీ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, దేశం వీడేందుకు నిర్దేశించిన గడువు తరువాత ఏ పాకిస్తానీనీ భారత్‌లో ఉండనివ్వరాదని ఆదేశించినట్లు అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. పాకిస్తానీలకు జారీ చేసిన అన్ని వీసాలను ఈ నెల 27 నుంచి రద్దు చేస్తున్నట్లు భారత్ గురువారం ప్రకటించింది. మంగళవారం పహల్‌గామ్‌లో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులను బలిగొన్న ఉగ్ర దాడిపై రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తిరిగి రావలసిందిగా పాకిస్తాన్‌లో నివసిస్తున్న భారత జాతీయులకు కేంద్రం సలహా ఇచ్చింది. హోమ్ శాఖ మంత్రి స్వయంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి గడువు తరువాత భారత్‌లో ఏ పాకిస్తానీ బస చేయకుండా చూడాలని వారిని కోరినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. తమ తమ ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి, వారిని తిప్పిపంపేలా చూడాలని కూడ ముఖ్యమంత్రులను కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. వీసాల రద్దు ఆదేశం హిందు పాకిస్తానీ జాతీయులకు ఇదివరకే జారీ చేసిన దీర్ఘకాలిక వీసాలకు వర్తించదు. అవి 'చేల్లుబాటులో ఉంటాయి.' పహల్‌గామ్ దాడికి సీమాంతర సంబంధాలు ఉండడంపై పాకిస్తానీ జాతీయులకు వీసా సర్వీసులను వెంటనే నిలుపుదల చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. 26/11 ముంబయి ఉగ్ర దాడి దరిమిలా దేశంలో పౌరులను లక్ష్యంగా చేసుకున్న హీనమైన ఉగ్ర దాడి అది. అదనంగా సార్క్ వీసా పొడిగింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద భారత్‌కు ప్రయాణించేందుకు పాకిస్తానీ జాతీయులను అనుమతించబోమని, ఎస్‌విఇఎస్ వీసా కింద ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాకిస్తానీ జాతీయుడు ఎవరైనా 48 గంటల్లోగా దేశం వదలి వెళ్లాలని కూడా ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఆ గడువు శుక్రవారంతో ముగిసింది. పహల్‌గామ్ మారణకాండలో పాత్ర ఉన్న ప్రతి ఉగ్రవాదిని, వారి 'మద్దతుదారులను' భారత్ 'గుర్తించి, ఆచూకీ తీసి, శిక్షిస్తుంది' అని, హంతకులను 'భూమి చివరి వరకు' వెంటాడుతుందని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం విస్పష్టంగా ప్రకటించారు. మరొక వైపు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా దౌత్యపరంగా దాడిని భారత్ ముమ్మరం చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో పార్టీలతో సంబంధం లేకుండా నాయకులు అందరూ ఉగ్రవాదంపైన, ఉగ్ర శిబిరాలపైన కఠిన చర్య తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు హామీ ఇచ్చారు. భారత్ అదే సమయంలో 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని వెంటనే నిలిపివేస్తున్నట్లు కూడా పాకిస్తాన్‌కు తెలియజేసింది. ఒప్పందం షరతులను పాక్ ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది.

ఉగ్రవాదంపై భారత్ సమైక్య పోరు సాగించాలి: రాహుల్ గాంధీ

శ్రీనగర్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండించారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలున్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటున్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండించాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధి వర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

"ఆపరేషన్ కగార్" ను నిలిపివేయండి- శాంతి చర్చలకు రండి:మూడోసారి మావోయిస్ట్ లు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 25: ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కరెగుట్టల వద్ద జరుగుతున్న ఆపరేషన్ కగార్‌పై వెంటనే ఆపేయాలని మావోయిస్టులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మావోయిస్టు బస్తర్ ఇన్‌ఛార్జ్ రూపేష్ పేరుతో ప్రెస్ నోట్ విడుదల అయ్యింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ముందుకు రావాలని లేఖలో మావోలు వినతి చేశారు. తెలంగాణ సరిహద్దులో కొనసాగుతున్న సైనిక ఆపరేషన్‌ను వెంటనే ఆపాలని మావోయిస్టులు కోరారు. కాగా.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో మావోయిస్టుల కోసం ఆపరేషన్ కొనసాగుతోంది.

గతంలో కూడా రెండు రెండు, మూడు సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. శాంతి చర్చలకు అవకాశం ఇవ్వాలని ఆపరేషన్స్‌ను వెంటనే నిలిపివేయాలని లేఖ రాసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తెలంగాణ ? ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని, శాంతి చర్చలకు ముందుకు రావాలని వినతి చేస్తూ మావోయిస్టు పార్టీ ఓ లేఖను విడుదల చేసింది. మావోయిస్టు బస్తర్ ఇన్‌చార్జ్ రూపేష్ పేరుతోనే ఈ ప్రకటన విడుదలైంది. అయితే ఈ లేఖపై పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శాంతి చర్చలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ సరిహద్దులో ఆపరేషన్ కొనసాగుతోంది.

ఉగ్రదాడిపై ప్రతీకారం .. భారత్ ముందు నాలుగు మిలిటరీ ఆప్షన్‌లు

న్యూ డిల్లీ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మూడు రోజుల క్రితం పహల్గాం లో జరిగిన ఉగ్రదాడితో భారత్ ఉలిక్కిపడింది. ఈ దాడిలో 26 మంది అమాయాక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రతీకారంతో రగిలిపోతోంది. ఈ క్రూరమైన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధవైంది. ఇందులో భాగంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా చేసేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపేసింది. ఇక పహల్గాంలో నరమేథం సృష్టించిన ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదని, వాళ్లకు ధీటైన జవాబు ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భారత ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి అడుగు వేయబోతుందనే విషయంలో నిపుణులు తమతమ అంచనాలను వెల్లడిస్తున్నారు. మొత్తానికి భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నాలుగు ఆప్షన్‌లు ఏమిటో ఇప్పుడు చూద్దాం..

ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ విమానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేయడం ఇండియన్ మిలిటరీ ముందున్న మొదటి ఆప్షన్. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు రఫేల్, మిరాజ్‌లకు ఉన్నాయి. అయితే ఈ ఆప్షన్‌ను ఎంచుకుంటే అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి.

లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటి..

నిమ్మ ఒప్పందాన్ని పక్కన పెడతామని తాజాగా పాకిస్థాన్ బెదిరించింది. ఆ ప్రకారం చూస్తే ఆ దేశం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. దాంతో భారత్‌కు దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఇటీవల ఎల్‌వోసీ వద్ద పాకిస్థాన్ జరిపిన ఉల్లంఘనలను భారత్ కారణంగా చూపవచ్చు. ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇది భారత్ ముందున్న మరో ఆప్షన్‌గా చెప్పవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు భారత దళాలకు సవాల్‌గా మారుతాయి. ఆపరేషన్లకు సుదీర్ఘ సమయం పట్టడం, ఇప్పటికే పలు బలమైన పొజిషన్లలో పాకిస్థాన్ దళాలు ఉండటం ప్రతికూలంగా మారవచ్చు.

భారీ టార్గెట్స్‌పై సర్జికల్ స్ట్రైక్స్..

భారీ టార్గెట్లను గుర్తించి సర్జికల్ స్ట్రైక్స్ చేయడం భారత్ ముందున్న మూడో ఆప్షన్. కాకపోతే ఇప్పుడు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటంతో సర్జికల్ స్ట్రైక్స్ అంత సులువు కాకపోవచ్చు. సక్సెస్‌ఫుల్‌గా సర్జికల్ స్ట్రైక్స్ చేయాలంటే రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్, శక్తిమంతమైన దళాలు, కచ్చితమైన ప్లానింగ్ అవసరం.

శతఘ్నులు, స్నైపర్లతో కాల్పులు..

ఇక లక్ష్యాలపై గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం భారత్ ముందున్న నాలుగో ఆప్షన్‌గా చెప్పవచ్చు. వీటితోపాటు భారీ మోర్టార్లను కూడా వాడవచ్చు. దాంతో ఉద్రిక్తతలకు అవకాశం తక్కువగా ఉంటుంది. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టవచ్చు. కాకపోతే ఈ దాడులతో ఫలితం పెద్దగా ఉండదు. భారీ దాడులతోనే భారీ ఫలితం దక్కుతుంది.

వర్ష బీభత్సంతో విరిగిపడ్డ కొండచరియలు.. చిక్కుకుపోయిన 1,000 మంది పర్యాటకులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: । ఈశాన్య రాష్ట్రం సిక్కింలో భారీ వర్షాలుబీభత్సం సృష్టించాయి. ఉత్తర సిక్కింలో నిరంతరం వర్షం పడుతోంది. దీంతో వరదలు సంభవించాయి.

భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు కీలక రహదారులను మూసివేశారు. ఈ కారణంగా వెయ్యి మందికిపైగా పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయారు

మున్నితాంగ్ ప్రాంతంలోని లాచెన్-చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ ప్రాంతాల్లో ఎడతెరివి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చాలా ప్రాంతాల్లో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. గాంగ్టక్ నుండి చుంగ్తాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో ఎడతెరివి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పరిస్థితి మరింత దిగజారింది. కఠినమైన వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరిగిపడటం వల్ల చుంగ్‌థాంగ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు సందర్శకులకు అనుమతించడం లేదు. ఈ పరిస్థితి కారణంగా వెయ్యి మంది పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. రంగంలోకి దిగిన అధికారులు వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే..

హైదరాబాద్, ఏప్రిల్ 25: హైదరాబాద్ నగరంలో అంగన్‌వాడీ కేంద్రాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పేద పిల్లల ఆలనా.. పాలనా చూసుకుంటూ అక్షరాభ్యాసానికి పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటీవల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అట్టహాసంగా జరుపుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు ఆయా కేంద్రాలలో అక్షరాభ్యాసం పూర్తి చేసుకున్న ఐదేళ్లలోపు పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు చేయిస్తున్నారు.

ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో గ్రేడ్లు ప్రకటించి గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రహమత్ నగర్ డివిజన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ అంగన్‌వాడీ సెంటర్లో స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందచేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా అంగన్వాడి సెంటర్లలో ప్లే స్కూల్ విద్యను అందిస్తున్నారని.. పేద, సామాన్య ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. లక్షలాది రూపాయలు వెచ్చించి అప్పుల పాలు కావద్దని హితవు పలికారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ ఎన్ఎస్బి నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ డి.అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇతర టీచర్లు ధనలక్ష్మి, అనిత, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి.. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కరీంనగర్, ఏప్రిల్ 25: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాజ్యసభ ఎంపీ సురేష్ రెడ్డి నిధులు రూ.2 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరుట్లలో ప్రజల సౌకర్యార్థం రూ.12 కోట్లతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సహకారంతో వంద పడకల ఆసుపత్రిని నిర్మించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన ఆసుపత్రి అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటులో లేవని, అవసరమైన స్టాఫ్ ను నియమించలేదని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రులను పలుమార్లు కలిసి ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు.

ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు శుద్ధమైన జలాన్ని అందించేందుకు ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాశిరెడ్డి మోహన్ రెడ్డి, అన్వర్, రవీందర్, ఆనంద్, ఆసుపత్రి సూపరిండెంట్ సునీతారాణి, వైద్యులు వినోద్, రమేష్, రామకృష్ణ, ఉదయ మార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తున్న మేధో సంపత్తి

(26 ఏప్రిల్ "ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం" సందర్భంగా)

"మానవాళి ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు ఒకే విధమైన పరిష్కారం అసాధ్యమని, ప్రతి సమస్య పరిష్కారంలో సృజనశీల ఆలోచనలు జోడిస్తే సరళ మార్గాలు ఆవిష్కరించబడి ఉత్తమ ఫలితాలు సుసాధ్యమని" ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ తెలపడం మేధావి వర్గం గుర్తుచేసుకోవాలి. ఈ దిశగా మేధో సంపత్తిని గుర్తించడం, ప్రోత్సహించడం, సంపత్తి హక్కులను కాపాడడం, సమాజోన్నతికి వినియోగించడం ఆయాదేశాల కనీస బాధ్యతగా తెలుసుకోవాలి. నేటి సృజనశీల ఆవిష్కరణలు రేపు పాతబడిపోతున్నాయి. శాస్త్రసాంకేతిక విప్లవం నిత్యనూతనంగా కొత్తపొంతలు తొక్కుతున్నది. నాడు ట్రాంకాల్ ద్వారా దూరప్రాంత ప్రజలతో మాట్లాడిన రోజుల నుంచి నేడు క్షణాల్లో స్మార్ట్ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా చూస్తూ మాట్లాడుకునే డిజిటల్ కాలానికి వచ్చాం. రేపు ఏ ఆవిష్కరణ మన జీవనశైలినా ఏ విధంగా మార్చనుందో ఊహకు అందడం లేదు. ఇలా మానవ జీవనశైలిలో పెను మార్పులు రావడానికి మేధో సంపత్తి పునాదిగా నిలుస్తున్నది.

ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం-2025 ఇతివృత్తం:

మేధావుల సృజన, వినూత్న ఆవిష్కరణల దాహంతో పలు అత్యాధునిక శాస్త్రసాంకేతిక ఉపకరణాలు మనల్ని అబ్బుర పరుస్తూ మన జీవనశైలిలో ఓ భాగం అవుతున్నాయి. వంటింటి నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు నిరంతరం కొనసాగుతున్నాయి. అత్యంత శక్తివంతమైన మేధో సంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ) ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 26 ఏప్రిల్ రోజున "ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం (వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ డే)" పాటించడం 26 ఏప్రిల్ 2000 నుంచి ప్రారంభమైంది. 2025 ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవ ఇతివృత్తంగా "మేధో సంపత్తి - సంగీతం : ఐపి బీట్‌ను అనుభూతి చెందండి" అనబడే అంశాన్ని తీసుకున్నారు. పేటెంట్లు, కాపీరైట్స్, ట్రేడ్ సీక్రెట్స్, డిజైన్స్, సంగీత రంగంలో సృజనలు, భౌగోళిక సూచికలు లాంటివి మోధో సంపత్తి కిందికి వస్తాయి. సృజనశీల ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలతో మేధావులు చేస్తున్న కృషి అనన్యసామాన్యం, అభినందనీయం. మేధో సంపత్తి పట్ల అవగాహన, ప్రోత్సాహం, మేధో హక్కుల పరిరక్షణ ప్రాధాన్యం, మేధో సంపత్తిని అక్రమంగా వాడుకునే అక్రమార్కులకు జైలు ఊచల రుచి చూపడం, మేధో హక్కుల విశ్లేషణలు, విస్తృత ప్రచారం, మేధో సంపత్తి సంబంధ చట్టాల అవగాహన, న్యాయపరమైన వివరాలు, ఆవిష్కరణలకు సరైన గుర్తింపు లాంటివి ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవ వేదికగా చర్చించబడతాయి.

దేశ వైజ్ఞానిక సమాజ సూచికలు మేధో సంపత్తి హక్కులు:

మేధో సంపత్తిలో ఓ ప్రధాన భాగంగా సాహిత్యం, సంగీతం, కళా సృజన, సినిమా, సింబల్స్, ఇమేజెస్, పేర్లు, వాణిజ్యపరమైన అంశాలు అనేకం వస్తాయి. మేధో సంపత్తి రక్షణ, విక్రయ బాధ్యతలు ఆవిష్కర్తకు మాత్రమే ఉంటాయి. మేధో సంపత్తి ఒక్కరిది లేదా సమూహానిది అయినప్పటికీ అందరికీ సమాన హక్కులు కల్పించబడతాయి. మేధో సంపత్తిని విక్రయించడం, లైసెన్స్ తీసుకోవడం, దానం చేయడం, వినిమయం చేయడం లాంటి సర్వాధికారాలు ఆవిష్కర్తలకు మాత్రమే ఉంటాయని తెలుసుకోవాలి. దేశాభివృద్ధి మేధో సంపత్తి మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. మేధో సంపత్తి హక్కులు అధికంగా యూఎస్, యూకె లాంటి దేశాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి మేధో సంపత్తి హక్కుల వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడడం, అమలులో జాప్యాలు జరగడం, వినియోగదారులపై పెను భారం పడడం జరుగుతుందని వాదనలు చేయలేదు వర్గాలు ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నారని కూడా తెలుసు కోవాలి.

పర్యావరణ హితమైన మేధో సంపదలకు నేడు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. వినూత్న ఆవిష్కరణలు మానవాళి జీవన విధానాలను సరళతరం చేస్తున్నాయి, సుఖ సంతోషాలకు పునాదులు నిలుస్తున్నాయి. నేటి యువత స్టెమ్ (సైన్స్ - టెక్నాలజీ - ఇంగ్లీష్/ఇంజనీరింగ్ - మ్యాథమ్యాటిక్స్) ఆధారంగా తమ పరిశోధనలతో విలువైన మేధో సంపత్తిని జనింపజేసి ఆచరణాత్మక మార్గాలను చూపుతూ ప్రపంచ మానవాళికి బహుమతులుగా అందజేయాలని కోరుకుందాం, మన భారతం కూడా ఐపి రంగంలో ముందంజలో ఉండాలని కోరుకుందాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

గత పదేళ్లలో అనేక మైనింగ్ సంస్కరణలను అమలు చేశాం.. ఇనుప ఖనిజం లభ్యత సులభతరమైంది: ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ముంబయిలో నిర్వహిస్తున్న ఇండియా స్టీల్ 2025 కార్యక్రమం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. భారత్‌లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న, భవిష్యత్తులో విస్తృతంగా అభివృద్ధి చెందడానికి అపారమైన అవకాశాలున్న ఉక్కు రంగంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ వచ్చే రెండు రోజులపాటు చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రంగం భారత పురోగతికి పునాది వేస్తుందని, అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేలా భారత మూలాలను బలోపేతం చేస్తుందని, విప్లవాత్మకమైన మార్పుల దిశగా దేశంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా స్టీల్-2025 కార్యక్రమానికి ప్రతి ఒక్కరికీ కీలకమైన ఆహ్వానం పలికారు. కొత్త ఆలోచనలను పంచుకోవడానికి, కొత్త భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికి, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ప్రయోగ వేదికగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఉక్కు రంగంలో కొత్త అధ్యాయానికి పునాది వేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

ఆకాశ హర్మ్యాలు, నౌకా నిర్మాణం, హైవేలు, వేగంగా దూసుకుపోయే రైళ్లు, స్మార్ట్ సిటీలు, పారిశ్రామిక కారిడార్లు... ఏవైనా, ఈ విజయగాథలన్నింటి వెనుకా ఉక్కే ప్రధాన శక్తిగా నిలిచిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు రూపుదిద్దడంలో ఉక్కు కీలక పాత్ర పోషించిందన్నారు. ''5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది, ఈ లక్ష్యంలో ఉక్కు రంగానిది కీలక పాత్ర'' అన్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఉక్కు ఉత్పత్తిదారుగా నిలవడం భారత్‌కు గర్వకారణమన్నారు. జాతీయ ఉక్కు విధానం కింద 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో తలసరి ఉక్కు వినియోగం సుమారు 98 కేజీలుగా ఉందని, 2030 నాటికి అది 160 కేజీలకు పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఉక్కు వినియోగంలో ఈ రకమైన పెరుగుదల దేశంలో మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థల పురోగతికి అత్యున్నత ప్రమాణంగా నిలుస్తుందని శ్రీ మోదీ చెప్పారు. దేశ అభివృద్ధి ప్రస్థానానికీ, అలాగే ప్రభుత్వ ప్రతిభకూ ప్రభావవంతమైన పనితీరుకూ ఇది నిదర్శనమన్నారు.

ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్‌ప్రణాళిక రూపకల్పన తర్వాత భవిష్యత్తుపై పూర్తి నమ్మకంతో ఉక్కు పరిశ్రమ ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. ఈ ప్రణాళిక వివిధ పౌర వినియోగ సేవలనూ రవాణా నదుపాయాలనూ సమన్వయం చేస్తోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గనులున్న ప్రాంతాలను గుర్తించడం ద్వారా ఆయా ప్రాంతాలను, ఉక్కు కర్మాగారాలున్న ప్రాంతాలను బహుముఖీనంగా అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఉక్కు రంగం ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్న తూర్పు భారతంలో కొత్త ప్రాజెక్టుల ద్వారా కీలకమైన మౌలిక సదుపాయాలను ఆధునికీకరిస్తున్నట్టు ఆయన చెప్పారు. 1.3 ట్రిలియన్ డాలర్ల విలువ కలిగిన జాతీయ మౌలిక సదుపాయాల ప్రణాళికలు అమలవుతున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు. అలాగే, పెద్ద ఎత్తున నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని, మునుపెన్నడూ లేనంత వేగంతో రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, పైప్ లైన్లను నిర్మిస్తున్నామని.. ఇవన్నీ ఉక్కు రంగానికి కొత్త అవకాశాలను అందిస్తాయని తెలిపారు. పీఎం ఆవాస యోజన ద్వారా కోట్లాదిగా ఇళ్లను నిర్మిస్తున్నామని, జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలను విశేషంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ఉక్కు రంగానికి జవసత్వాలను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ప్రాజెక్టుల్లో 'మేడిన్ ఇండియా' ఉక్కునే వినియోగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉటంకిస్తూ.. దీనివల్ల ప్రభుత్వం చేపట్టే మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాల్లో పెద్ద ఎత్తున ఉక్కు వినియోగానికి మార్గం ఏర్పడిందని వివరించారు.

అనేక రంగాల్లో అభివృద్ధికి ఉక్కుప్రధాన చోదక శక్తిగా ఉందన్నారు. ఉక్కు పరిశ్రమపై ప్రభుత్వ విధానాల వల్ల ఇతర భారతీయ పరిశ్రమలు అంతర్జాతీయంగా పోటీపడే స్థాయిలో నిలుస్తున్నాయన్నారు. తయారీ, నిర్మాణం, యంత్రాలు, ఆటోమోటివ్ వంటి వివిధ రంగాలను భారత ఉక్కు పరిశ్రమ బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. 'మేకిన్ ఇండియా'ను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో జాతీయ తయారీ మిషన్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలకు ఈ మిషన్ తోడ్పడుతుందని, ఉక్కు రంగానికి కొత్త అవకాశాలను అందిస్తుందని చెప్పారు.

రక్షణ, వ్యూహాత్మక రంగాలకు కీలకమైన హై గ్రేడ్ ఉక్కు కోసం భారత్ చాలా కాలంగా దిగుమతులపైనే ఆధారపడి ఉందన్న ప్రధానమంత్రి.. భారత్ తొలిసారి దేశీయంగా రూపొందించిన విమానవాహక నౌకలో వినియోగించిన ఉక్కు దేశీయంగానే ఉత్పత్తి అవడం గర్వకారణమన్నారు. చరిత్రాత్మక చంద్రయాన్ మిషన్ విజయవంతం కావడానికి భారత ఉక్కు దోహదపడిందని, దేశ సామర్థ్యం, ఆత్మవిశ్వాసానికి ఇది ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. పీఎల్ఐ వంటి పథకాలు, కార్యక్రమాల ద్వారానే ఈ విప్లవాత్మకమైన మార్పు సాధ్యమైందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. హైగ్రేడ్ ఉక్కు ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం ఈ పథకం ద్వారా వేలాది కోట్ల రూపాయలు కేటాయించారు. ఇది ఆరంభం మాత్రమేనని, సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న మెగా ప్రాజెక్టుల వల్ల హైగ్రేడ్ ఉక్కుకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో నౌకా నిర్మాణాన్ని మౌలిక సదుపాయాల విభాగంలో చేర్చామన్న ఆయన.. ఆధునిక, భారీ నౌకలను దేశీయంగానే తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దేశంలో పైప్ లైన్ గ్రేడ్ ఉక్కు, తుప్పును తట్టుకునే మిశ్ర లోహాలకు డిమాండ్ పెరుగుతోందని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశంలో రైల్వే మౌలిక సదుపాయాలు మునుపెన్నడూ లేనంత వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. దిగుమతి రహితంగా, నికర ఎగుమతుల దిశగా దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రస్తుతం 25 మిలియన్ టన్నుల ఉక్కును ఎగుమతి చేయాలనే లక్ష్యంతో భారత్ పనిచేస్తోందని, 2047 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని 500 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఉక్కు రంగం కొత్త ప్రక్రియలు, గ్రేడ్లు, స్థాయిలను అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ.. భవిష్యత్ సన్నద్ధంగా ప్రభుత్వపరంగా పరిశ్రమను విస్తరించి, నవీకరించాలని కోరారు. ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందితే అపారమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కొత్తగా ఆలోచించాలని, వాటిని అందరితో పంచుకోవాలని ప్రైవేటు, ప్రభుత్వ రంగాలకు పిలుపునిచ్చారు. తయారీ, పరిశోధన- అభివృద్ధి, సాంకేతిక ఉన్నతీకరణల్లో సహకారం ద్వారా దేశ యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు.

ఉక్కు పరిశ్రమ పలు సవాళ్లను ఎదుర్కొంటోందని, భవిష్యత్ అభివృద్ధి కోసం వాటిని పరిష్కరించాల్సిన అవసరముందని శ్రీ మోదీ అన్నారు. ముడి పదార్థాల లభ్యత ప్రధాన సమస్యగా ఉందనీ.. నికెల్, కోకింగ్ బొగ్గు, మాంగనీస్ కోసం భారత్ ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, సురక్షితమైన సరఫరా వ్యవస్థలను నెలకొల్పడం, సాంకేతిక ఉన్నతీకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్కువ ఇంధనంతో ఎక్కువ ఉత్పాదకతనిచ్చే, తక్కువ ఉద్గారాలను వెలువరించే, అధునాతన డిజిటల్ సాంకేతికతలను అందిపుచ్చుకునే దిశగా వేగంగా పురోగమించడం అత్యావశ్యకమన్నారు. "కృత్రిమ మేధ, ఆటొమేషన్, పునర్వినియోగం, అనుబంధ ఉత్పత్తుల వినియోగాలే ఉక్కు పరిశ్రమ భవిష్యత్తును నిర్ణయిస్తాయి'' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆవిష్కరణల ద్వారా ఈ రంగాల్లో మరింతగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంతర్జాతీయ భాగస్వాములూ భారతీయ కంపెనీల మధ్య సహకారం ఈ సమస్యలను మరింత సమర్థంగా, వేగంగా పరిష్కరించడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బొగ్గు దిగుమతులు, ముఖ్యంగా కోకింగ్ బొగ్గు దిగుమతులు వ్యయాన్నీ పొదుపునూ ప్రభావితం చేస్తాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. దిగుమతులకు ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సిన అవశ్యకత ఉందన్నారు. అందుబాటులో ఉన్న డీఆర్ఐ రూట్ వంటి సాంకేతికతలను ప్రస్తావిస్తూ, వాటిని మరింత ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు. బొగ్గును సంశ్లేషిత వాయువుగా మార్చే ప్రక్రియ (కోల్ గ్యాసిఫికేషన్)ను ప్రభావవంతంగా వినియోగించుకోవడం ద్వారా.. దేశంలోని బొగ్గు వనరులను మరింత సద్వినియోగం చేసుకోవచ్చని, దిగుమతులపై ఆధారపడడాన్ని అది తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఈ దిశగా క్రియాశీలకంగా కృషి చేయాలని, ఈ దిశగా సరైన చర్యలు తీసుకోవాలని ఉక్కు పరిశ్రమలను ఆయన కోరారు.

ఇప్పటివరకు వినియోగంలో లేని గని ప్రాంతాల్లో కొత్తగా మైనింగ్ కార్యకలాపాలకు సంబంధించి మాట్లాడుతూ ? గత దశాబ్ద కాలంగా విశేషంగా మైనింగ్ సంస్కరణలను ప్రవేశపెట్టామని, ఇనుప ఖనిజం లభ్యతను అది మరింత సులభతరం చేస్తుందని శ్రీ మోదీ పేర్కొన్నారు. "కేటాయించిన గనులను ప్రభావవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా దేశంలోని వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన సమయమిది" అని ఆయన స్పష్టం చేశారు. ఇందులో జాప్యం చేస్తే పరిశ్రమను అది ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని హెచ్చరిస్తూ.. కొత్త ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం ద్వారా ఈ సవాలును అధిగమించాలని శ్రీ మోదీ కోరారు.

ఇకనుంచి భారత్ దేశీయ వృద్ధిపై దృష్టి పెట్టడమే కాకుండా, అంతర్జాతీయంగా నేతృత్వం వహించేలా సన్నద్ధమవుతోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అత్యుత్తమ నాణ్యతతో కూడిన ఉక్కును అందించే విశ్వసనీయ సరఫరాదారుగా ప్రపంచం నేడు భారత్‌ను చూస్తోందని వ్యాఖ్యానించారు. ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచ స్థాయి ప్రమాణాలను కొనసాగించడం, సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవడం అత్యంత ముఖ్యమైన అంశమని పునరుద్ఘాటించారు. రవాణాను మెరుగుపరచడం, వివిధ రకాల రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఖర్చులను తగ్గించుకోవడం... ఉక్కుకు అంతర్జాతీయ కేంద్రంగా భారత్‌ను నిలపడంలో దోహదం చేస్తాయన్నారు. సామర్థ్యాలను పెంపొందించుకోవడం, కార్యాచరణ ద్వారా ఆలోచనలను సాకారం చేసుకోవడానికి 'ఇండియా స్టీల్' వేదికగా నిలుస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. పునరుత్థాన, విప్లవాత్మక, ఉక్కులా దృఢమైన భారత్‌ను సాధించే దిశగా సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

పెట్టుబడిదారులను భయపెడితే ఊరుకునేది లేదు- కేశినేని శివనాథ్

అమరావతి, ఏప్రిల్ 25:పుట్టి పెరిగిన ప్రాంతం పై మమకారంతో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రవాసాంధ్రులను భయపెట్టాలని చూడడం దుర్మార్గమైన, హేయమైన చర్య అని విజయవాడ పార్లమెంటు సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేక వచ్చే పెట్టుబడులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టే ప్రతి ఎన్నారై కు అండగా కూటమి ప్రభుత్వంతో పాటు తాను ప్రత్యేకంగా రక్షణ కవచంలా ఉంటానని తెలిపారు.

9 నెలల కూటమి పాలనలో 7 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని, అతి త్వరలో పెద్ద ఎత్తున రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలగనున్నట్లు తెలిపారు. అడ్రస్ లేని సూట్ కేసు కంపెనీలను పెట్టిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిని, జగన్ ఆడే డ్రామాలు ఉల్పా బ్యాచ్ విభిన్న పాత్రలు పోషిస్తుందన్నారు. విజయవాడలోని గురునానక్ కాలనీలో ఉన్న ఎన్టీఆర్ భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న ఎన్ఆర్ఐలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.

ఏపీకి పెట్టుబడులు వస్తుంటే జగన్ అండ్ కంపెనీ డ్రామాలు అడుతున్నాయనీ, జగన్ లాగా కూటమి ఎప్పుడు పీఠాలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు భూములు ధారాదత్తం చేయలేదన్నారు. ఉర్సా కంపెనీ డేటా సెంటర్ పెట్టడానికి ముందుకు వస్తే మోకాలు అడ్డుతున్నారనీ, 3700 కోట్ల టర్నోవర్ ఉర్సా సంస్థకు ఉందనీ వివరించారు. 21 సూట్ కేసు కంపెనీలు పెట్టిన చరిత్ర ఉన్న జగన్ ఇప్పుడు ఎన్నారైల పై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఎన్.ఆర్.ఐ లకు ఎవరైనా అడ్డువస్తే ఖబడ్దార్ అంటూ ఎన్.ఆర్.ఐ లకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రకటించారు. ఏపీ ప్రభుత్వానికి ప్రవాసాంధ్రులు అండగా ఉంటే వారిపై విమర్శలు చేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ఉర్సా సంస్థ రాకుండా జగన్ అండ్ ఉల్పా టీం అడ్డుకుంటే సహించమంటూ హెచ్చరించారు.

పుట్టి పెరిగిన ప్రాంతంలో పెట్టుబడులు పెట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనుకుంటున్న ప్రవాసాంధ్రులపై జగన్ విషం చిమ్ముతున్నాడనీ ఇంతకన్నా దుర్మార్గమైన విషయం ఇంకొకటి ఉంటుందా అని వాపోయారు. ప్రవాసాంధ్రులకు తాము అండగా ఉంటాం. వాళ్ల నిర్ణయంగా పెట్టుబడులు పెట్టవచ్చని అభయమిచ్చారు. ప్రవాసాంధ్రుల జోలుకు ఎవరొచ్చినా ఉపేక్షించేది లేదనీ గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రం మీద, నిరుద్యోగ యువత మీద ఎందుకింత కక్షకట్టారో సమాధానం చెప్పాలని బహిరంగంగా ప్రశ్నించారు. విజయవాడ వరద బాధితులకు విరాళంగా ఇచ్చిన కోటి రూపాయలు ఏం చేశారో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదన్నారు.

అన్నార్తులకు ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్.. కలెక్టర్ లక్ష్మీశ

అమరావతి, ఏప్రిల్ 25:: పేదలకు కడుపు నిండా భోజనం పెడుతూ అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్లలో నిర్వహణ పరంగా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని సింగ్‌నగర్ అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పట్టిక, టోకెన్ కౌంటర్, ఆహార పదార్థాలను వడ్డిస్తున్న స్థలం, డైనింగ్ ఏరియాతో పాటు పరిశుభ్రమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాట్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు చేసిన ఏర్పాట్లు, మరుగుదొడ్లు తదితరాలను కూడా పరిశీలించారు.

క్యూలైన్ లో నిల్చొని స్వయంగా రూ.5 టోకెన్‌ను కొనుగోలు చేసి అల్పాహారాన్ని రుచి చూశారు. అల్పాహార నాణ్యత ఎలా ఉందో అక్కడికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఆహారం తిన్నాక క్యాంటీన్‌లో కల్పించిన సౌకర్యాలు, ఆహార శుచి, రుచి ఎలా ఉందో లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను తీసుకునే ప్రక్రియను పరిశీలించడంతో పాటు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి స్వయంగా అభిప్రాయం తెలియజేశారు. క్యాంటీన్‌లో ప్రతి రోజూ పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఎలా ఉంది.. అహారం నాణ్యత ఎలా ఉంది.. సరైన సమయానికే క్యాంటీన్ తెరుస్తున్నారా.. వంటి వివరాలు పొందుపరచాలని, దీనివల్ల మరింత మెరుగ్గా సేవలందించేందుకు వీలవుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు సూచించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మార్గనిర్దేశంతో ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి సొంతమవుతుందని.. ప్రభుత్వ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో సేవలందించాలని సూచించారు. పటిష్ట పర్యవేక్షణతో అన్నా క్యాంటీన్ల ద్వారా పూర్తిస్థాయిలో సంతృప్తికరమైన సేవలు అందించేలా చూస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అమాయకులైన పర్యాటకులను చంపడం దుర్మార్గం.. నాదెండ్ల మనోహర్

అమరావతి, ఏప్రిల్ 25:జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయకులైన 26 మంది పర్యాటకులను చంపడం దుర్మార్గమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ముందు మన దేశం, మన రాష్ట్రం ఆ తర్వాతే మనమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఇవాళ జనసేన ఆధ్వర్యంలో విజయవాడలోని పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, రావి సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉంటామని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. జనసేన ప్రతి నియోజకవర్గంలో చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

ఎంత బాధ ఉన్నా ఇలాంటి ఘటనల సమయంలో మనమంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కావలిలో జనసేన నేత మధునూదనరావు భౌతికకాయాన్ని చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారని అన్నారు. జరిగిన దుర్ఘటన అతని భార్య చెబుతుంటే తమ కంట కన్నీరు ఆగలేదని చెప్పారు. అంత ఘోరంగా, అన్యాయంగా పర్యాటకులను చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో భారతీయ పౌరులంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అండగా ఉండాలని సూచించారు. జనసేన పక్షాన కొవ్వొత్తుల ర్యాలీ, నిన్న మౌన దీక్షలయ, ఇవాళ మానవహారం నిర్వహించామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. మన జెండా చూసి ఎంత గర్వ పడతామో.. అదే విధంగా మనం కలిసి ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బాధిత కుటుంబాలకు మనం అండగా ఉన్నామనే భరోసా ఇవ్వాలని చెప్పారు. ఉగ్రవాదుల దుశ్చర్యలకు తప్పకుండా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పి తీరుతుందని.. వారికి సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు. ఇప్పుడు రాజకీయాలు, కుల, మతాలు చూడవద్దని అన్నారు. మనం భారతీయులుగా మన వాళ్లకు అండగా ని

ఈ అంశంలో దేశం కృతనిశ్చయంతో ఉంది: పీఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ఈ రోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్లోని మధుబనిలో కొన్ని ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే పూర్తయిన వాటిని జాతికి అంకితం చేశారు. వీటన్నింటి మొత్తం విలువ రూ.13,480 కోట్లు. పెహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో మరణించినవారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించాలని కార్యక్రమానికి హాజరైన వారిని ప్రధాని కోరారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా దేశమంతా మిథిల, బీహార్తో అనుసంధానమైందని అన్నారు. బీహార్ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయల విలువైన విద్యుత్, రైల్వేలు, వసతుల ప్రాజెక్టులను ప్రారంభించామని, శంకుస్థాపనలు చేశామని తెలిపారు. ఇవి బీహార్లో నూతన ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తాయని చెప్పారు. ప్రముఖ కవి రాంధారి సింగ్ దినకర్ జీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు.

మహాత్మాగాంధీ తన సత్యాగ్రహ మంత్రాన్ని విస్తరించిన నేలగా బీహార్ను శ్రీ మోదీ వర్ణించారు. గ్రామాలు దృఢంగా ఉన్నప్పుడే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని మహాత్మాగాంధీ విశ్వసించే వారని తెలిపారు. ఇది పంచాయతీరాజ్ అనే భావనలో ఇమిడి ఉందని తెలిపారు. "గడచిన దశాబ్దంగా పంచాయతీలకు సాధికారత కల్పించేందుకు నిరంతర చర్యలు చేపడుతున్నాం. పంచాయతీలను బలోపేతం చేయడంలో సాంకేతికత కీలకమైన పాత్ర పోషించింది. గత పదేళ్లలో 2 లక్షలకు పైగా గ్రామ పంచాయతీలు ఇంటర్నెట్కు అనుసంధానమయ్యాయి" అని ప్రధాని వివరించారు. అలాగే గ్రామాల్లో 5.5 లక్షలకు పైగా పౌర సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీలను డిజిటలీకరణ చేయడం ద్వారా జనన, మరణ ధ్రువపత్రాలు, భూ యాజమాన్య హక్కు పత్రాలను సులభంగా పొందడం లాంటి అదనపు ప్రయోజనాలుంటాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన దశాబ్దాల అనంతరం దేశం కొత్త పార్లమెంట్ భవనం నిర్మించుకుందని, అలాగే దేశవ్యాప్తంగా 30,000 నూతన పంచాయతీ భవనాల నిర్మాణం జరిగిందని తెలిపారు. "గత దశాబ్దంలో పంచాయతీలకు రూ. 2 లక్షల కోట్లు నిధులు అందాయి. వాటిని గ్రామాభివృద్ధి కోసం వినియోగించారు" అని చెప్పారు.

గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో భూవివాదాలకు సంబంధించిన అంశాలు ఒకటి. ఒక భూమి నివాస సంబధమైనదా? వ్యవసాయ భూమి లేదా పంచాయతీ ఆధీనంలో ఉందా? ప్రభుత్వానిదా? అనే దానిపై తరచూ వివాదాలు నెలకొంటున్నాయని ప్రధానమంత్రి అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి భూ రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని, భూములకు సంబంధించి అనవసరమైన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు దోహదపడిందని అన్నారు.

పంచాయతీలు సామాజిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయని శ్రీమోదీ అన్నారు. పంచాయతీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించిన మొదటి రాష్ట్రం బీహారే అని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆర్థికంగా వెనుకబడిన, దళితులు, మహాదళితులు, వెనుకబడిన, అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలు ప్రజా ప్రతినిధులుగా బీహార్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇదే నిజమైన ప్రజాస్వామ్యమని, అసలైన సామాజిక భాగస్వామ్యమని వర్ణించారు. ప్రజాస్వామ్యంలో ఎక్కువ మంది భాగం పంచుకున్నప్పుడే అది బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. ఈ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇది అన్ని రాష్ట్రాలకు చెందిన మహిళలకు లబ్ధి చేకూరుతుందని, చట్టసభల్లో వారికి ప్రాతినిధ్యం కల్పిస్తుందని వివరించారు.

మహిళల ఆదాయాన్ని పెంపొందించేందుకు, వారికి నూతన ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీ మోదీ తెలిపారు. బీహార్లో అమలు చేస్తున్న 'జీవికా దీదీ' చూపిస్తున్న సానుకూల ప్రభావాన్ని వివరిస్తూ.. ఈ పథకం ఎంతో మంది మహిళల జీవితాలను మార్చిందని అన్నారు. బీహార్లోని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు దాదాపుగా రూ.1,000 కోట్ల ఆర్థిక సాయం అందిందని వెల్లడించారు. ఇది మహిళల ఆర్థిక సాధికారతను మెరుగుపరచి, దేశంలో 3 కోట్ల మంది లక్పతీదీదీలను తయారు చేయాలనే లక్ష్యానికి తోడ్పడుతుందని తెలిపారు. గడచిన దశాబ్దంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకుందని ప్రధాని అన్నారు. గ్రామాల్లో పేదలకు ఇళ్లు, రోడ్లు, గ్యాస్ కనెక్షన్లు, కుళాయి కనెక్షన్లు, టాయిలెట్లు నిర్మించినట్లు తెలిపారు. దీనివల్ల గ్రామాలకు లక్షల కోట్ల రూపాయలు వచ్చాయని వెల్లడించారు. కొత్త అవకాశాలను సృష్టించడం ద్వారా కార్మికులు, రైతులు, వాహనాలు నడిపేవారు, దుకాణదారులకు లబ్ధి చేకూరిందని, వారికి నూతన ఆదాయ మార్గాలు అందాయని పేర్కొన్నారు. దీనివల్ల తరాల తరబడి అణచివేతకు గురైన సమూహాలకు ప్రధాన లబ్ధి చేకూరిందని తెలిపారు. దీనికి ఉదాహరణగా పీఎం ఆవాస యోజన పథకాన్ని ప్రధానమంత్రి ఉటంకించారు. దేశంలో ఏ కుటుంబం ఇల్లు లేకుండా ఉండకూడదని, అందరికీ తలదాచుకోవడానికి శాశ్వత నీడ అందించాలనే లక్ష్యంతో ఈ పథకం రూపొందింది. ఈ పథకం ద్వారా గడచిన దశాబ్దంలో 4 కోట్ల శాశ్వత గృహాలను నిర్మించామని ఆయన వెల్లడించారు. బీహార్లోనే 57 లక్షల పేద కుటుంబాలకు శాశ్వత గృహాలను నిర్మించినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలు, దళితులు, వెనుకబడిన, పాస్మాందా కుటుంబాల వంటి అత్యంత వెనుకబడిన సమాజాలకు ఈ గృహాలను అందించామన్నారు. రానున్న సంవత్సరాల్లో మరో 3 కోట్ల శాశ్వత గృహాలను పేదలకు అందిస్తామని శ్రీ మోదీ ప్రకటించారు. ఈ రోజు బీహార్ వ్యాప్తంగా 1.5 లక్షల కుటుంబాలు నూతన గృహాల్లోకి మారుతున్నాయనీ, దేశవ్యాప్తంగా 15 లక్షల పేద కుటుంబాలకు కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి పత్రాలు మంజూరు చేశామనీ అన్నారు. వారిలో 3.5 లక్షల మంది లబ్ధిదారులు బీహార్కు చెందినవారు ఉన్నట్లు తెలిపారు. 10 లక్షల పేద కుటుంబాలకు పక్కా ఇళ్ల కోసం ఆర్థిక సాయం లభించిందని, దీనిలో బీహార్కు చెందిన 80,000 గ్రామీణ కుటుంబాలు, 1 లక్ష పట్టణ కుటుంబాలు ఉన్నాయని వెల్లడించారు.

"గడచిన పదేళ్లు భారత్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగిన దశాబ్దం" అని ప్రధానమంత్రి వర్ణించారు. దేశంలో బలోపేతమైన ఆధునిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందిన భారత్కు పునాదిగా పనిచేస్తాయన్నారు. మొదటిసారి దేశంలో 12 కోట్ల గ్రామీణ కుటుంబాలు మంచి నీటి కుళాయి కనెక్షన్లు పొందాయన్నారు. అలాగే 2.5 కోట్ల కుంటుబాలకు విద్యుత్ సదుపాయం లభించిందని, గ్యాస్ పొయ్యి మీద వండుతామని ఎన్నడూ ఊహించని వారు ఇప్పుడు గ్యాస్ సిలిండర్లు తీసుకుంటున్నారని అన్నారు. "లద్దాఖ్, సియాచెన్ లాంటి సవాళ్లతో కూడిన, కనీస సౌకర్యాలు కనీస మౌలిక సదుపాయాలు అందించడం కూడా కష్టంగా ఉండే ప్రాంతాల్లో 4జీ, 5జీ మొబైల్ కనెక్షన్లు ఏర్పాటయ్యాయి. ఇది దేశ ప్రస్తుత ప్రాధాన్యాలను తెలియజేస్తుంది" అని అన్నారు. ఆరోగ్య రంగంలో సాధిస్తున్న పురోగతి గురించి మాట్లాడుతూ, ఎయిమ్స్ లాంటి సంస్థలు ఒకప్పుడు ఢిల్లీ లాంటి ప్రధాన నగరాలకే పరిమితమై ఉండేవన్నారు. దర్భంగాలో ఎయిమ్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దేశంలో గడచిన దశాబ్దంలో మెడికల్ కాలేజీల సంఖ్య రెట్టింపు అయిందని చెబుతూ జాంజర్పూర్లో కొత్త మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. గ్రామాల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించేందుకు దేశవ్యాప్తంగా 1.5 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేశామని, వాటిలో 10,000 కేంద్రాలు బీహార్లోనే ఉన్నాయని తెలిపారు. జనఔషధి కేంద్రాలు 80 శాతం డిస్కౌంట్తో ఔషధాలను అందిస్తూ పేద, మధ్యతరగతి వారికి ఉపశమనాన్ని ఇస్తున్నాయని చెప్పారు. బీహార్లో ప్రస్తుతం 800కు పైగా జన ఔషధి కేంద్రాలున్నాయని, వాటి ద్వారా ప్రజలకు రూ.2,000 కోట్ల రూపాయల వైద్య ఖర్చులు ఆదా అయ్యాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా బీహార్లోని లక్షలాది కుటుంబాలకు ఉచిత వైద్యం లభిస్తోందన్నారు. తద్వారా ఈ కుటుంబాలకు వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని తెలిపారు.

''రైలు మార్గాలు, రోడ్లు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాలను సమకూరుస్తూ భారత్ తన సంధానాన్ని శరవేగంగా విస్తరిస్తోంద"ని శ్రీ మోదీ ప్రధానంగా చెప్పారు. పాట్నాలో మెట్రో ప్రాజెక్టుల పనులు పురోగమిస్తున్నాయని తెలియజేస్తూ, దేశమంతటా రెండు డజన్లకు పైగా నగరాలు ప్రస్తుతం మెట్రో సౌకర్యాలతో ఉన్నాయన్నారు. పాట్నా, జయ్నగర్ల మధ్య 'నమో భారత్ ర్యాపిడ్ రైల్' సర్వీసును మొదలుపెడుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఇది ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణించడానికి పట్టే కాలాన్ని చెప్పుకోదగినంతగా తగ్గిస్తుందని, దీని వల్ల సమస్తిపుర్, దర్భాంగా, మధుబని, బెగుసరాయిలలో లక్షల మంది ప్రజలు లాభపడతారని ఆయన వివరించారు.

బీహార్లో అనేక కొత్త రైల్వే లైన్లను ప్రారంభించడంతోపాటు కొన్నింటి పనులను మొదలుపెట్టిన విషయాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. సహర్సా, ముంబయిల మధ్య ఆధునిక అమృత్ భారత్ రైలు సర్వీసును ప్రారంభించిన సంగతిని చెబుతూ ఇది శ్రామిక కుటుంబాలకు ఎంతో ప్రయోజనకారి అవుతుందన్నారు. బీహార్లో మధుబని, ఝార్ఖుర్పుర్ సహా అనేక రైల్వే స్టేషన్లకు ప్రభుత్వం కొత్త రూపును కల్పిస్తోందన్నారు. దర్భాంగా విమానాశ్రయం ఏర్పాటు కావడంతో, మిథిలలోనూ బీహార్లోనూ విమానయాన సంధానం గణనీయంగా మెరుగుపడిందని, పాట్నా విమానాశ్రయ విస్తరణ పనులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. "ఈ అభివృద్ధి ప్రాజెక్టులు బీహార్లో కొత్త ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయి" అని ఆయన అన్నారు.

"రైతులే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నారు... వెన్నెముక ఎంత బలంగా ఉంటే, గ్రామాలు అంత బలంగా ఉంటాయి... ఫలితంగా దేశం కూడా బలోపేతం అవుతుంది'' అని శ్రీ మోదీ అభివర్ణించారు. మిథిల, కోసీ ప్రాంతాలకు వరదలు సదా సవాళ్లను రువ్వుతూ వస్తున్నాయని ఆయన ప్రస్తావిస్తూ, బీహార్లో వరదల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం రూ.11,000 కోట్లు ఖర్చు పెట్టనుందని తెలిపారు. ఈ డబ్బుతో బాగ్మతి, ధర్, బుధీ గండక్, కోసీ వంటి నదులపై ఆనకట్టలను నిర్మించవచ్చని, కాలవలను అభివృద్ధిపరిచి నదీజలాలను పంటకాల్వల్లోకి మళ్లించే ఏర్పాట్లు చేస్తారని వివరించారు. ''ఈ కార్యక్రమం వరద సమస్యల్ని తగ్గించడమే కాకుండా ప్రతి రైతు పొలానికీ తగినంత సాగునీరు అందేట్లు చూడొచ్చు" అని చెప్పారు.

"మిథిలలో పండుతున్న మఖానా ఇక మహా ఆహారంగా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకొంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. మఖానాకు జీఐ ట్యాగ్ (భౌగోళిక గుర్తింపు)ను ఇచ్చారు... ఇది ఈ ప్రాంతంలో పండే పంట అని అధికారికంగా ధ్రువీకరించారని గుర్తు చేశారు. మఖానా పరిశోధన కేంద్రానికి జాతీయ హోదా ఇచ్చారని కూడా ఆయన చెప్పారు. మఖానా బోర్డు ఏర్పాటు అంశాన్ని బడ్జెటులో పేర్కొన్న సంగతిని ప్రముఖంగా చెప్పారు. దీంతో మఖానా రైతుల దశ తిరుగుతుందన్న ఆశలున్నాయి. ఇప్పుడు బీహార్లో ఉత్పత్తి అయ్యే మఖానా ఒక 'సూపర్ఫూడ్'గా అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీహార్లో ఏర్పాటు చేయనున్న 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫూడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్' ఆహార శుద్ధికి సంబంధించిన చిన్న వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేయడంలో యువతకు దన్నుగా నిలుస్తుందని ఆయన తెలిపారు. వ్యవసాయంతో పాటు చేపల పెంపకంలో బీహార్ నిరంతరం పురోగతిని సాధిస్తోందని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ఇప్పుడు మత్స్యకారులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డ్ ప్రయోజనాలను అందుకునే వీలుంది. ఇది చేపల పెంపకం రంగంలో ఉన్న అసంఖ్యాక కుటుంబాలకు ప్రయోజనాలను కలిగిస్తుందన్నారు. పీఎం మత్స్య సంపద యోజనలో భాగంగా, బీహార్లో వందల కోట్ల రూపాయల ఖర్చుతో అనేక ప్రాజెక్టులను అమలుచేస్తున్నట్లు తెలిపారు.

జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ్లో ఏప్రిల్ 22న అమాయక పౌరులను ఉగ్రవాదులు చంపిన ఘటనపై శ్రీ మోదీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. యావత్తు దేశ ప్రజలు చింతిస్తున్నారని, శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబాలకు తోడుగా ఉంటామంటూ వారంతా వెన్నంటి నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. గాయపడి వైద్య చికిత్సను పొందుతున్న వారు త్వరగా కోలుకొనేటట్లు చూడడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోందని ప్రధాని హామీనిచ్చారు. అనేక కుటుంబాలకు తీరని నష్టం కలిగింది. కొందరికి వారి బిడ్డలు విగతజీవులయ్యారు. కొందరికి వారి సోదరులు దూరమైపోయారు. మరి కొందరికి జీవన భాగస్వాములు నేలకొరిగారు. బాధితులు భిన్న భాషల వాళ్లు... వారి ప్రాంతాలు వేర్వేరు... కొంతమంది బెంగాలీ మాట్లాడితే, కొందరు కన్నడం, ఇంకొందరు మరాఠీ, ఇంకా... ఒడియా, గుజరాతీ భాష మాట్లాడే వాళ్లు. కొందరు బీహార్కు చెందిన వాళ్లు ఉన్నారు అని ఆయన వివరించారు. కార్గిల్ నుంచి కన్యకుమారి వరకు చూస్తే, ఈ దాడి తరువాత పెల్లుబుకుతున్న మనోవేదన, ఘోర అన్యాయం జరిగిందంటూ వెల్లువెత్తుతున్న భావన.. వీటిని దేశం నలుమూలల నివసిస్తున్న ప్రజలు తరతమ భేదాలు లేకుండా వ్యక్తం చేస్తున్నారని శ్రీ మోదీ చెబుతూ... ఈ దాడి సాధారణ పర్యాటకుల మీద మాత్రమే జరిగిన దాడి కాదు... ఇది భారతదేశం ఆత్మపై సిగ్గుమాలిన దౌర్జన్యానికి తెగబడడమని వ్యాఖ్యానించారు. "ఈ దాడికి బాధ్యులైన ఉగ్రవాదులు, దీనికి కుట్ర చేసిన వారు సహా, ఊహకయినా అందనంత శిక్షను ఎదుర్కొంటారు" అని ఆయన సందిగ్ధానికి ఎంతమాత్రం తావివ్వక సూటిగా ప్రకటించారు. ఇంకా మిగిలి ఉన్న ఉగ్ర స్థావరాలను నాశనం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టీకరించారు. "140 కోట్ల మంది భారతీయుల ఇచ్ఛాశక్తి ఇక భయాన్ని వ్యాప్తి చేసే వారి వెన్ను విరిచేస్తుంది" అని తేల్చి చెప్పారు.

ప్రతి ఉగ్రవాదిని, వారికి కొమ్ము కాసే వారిని భారత్ ఆరా తీసి, వారి కదలికలను పసిగట్టి, శిక్షిస్తుంది...ఈ భూమిలో ఏ మూలన దాక్కొని ఉన్నా సరే- వారిని వెంటాడి వేటాడుతుందని ప్రధాని బీహార్ నేల మీద నుంచి ప్రకటించారు. "భారత్ ఉత్సాహాన్ని ఉగ్రవాదం ఎప్పటికీ చిన్నబిన్నం చేయజాలదు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదు. న్యాయం చేసే వరకూ సకల ప్రయత్నాలూ జరుగుతాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఈ సంకల్పాన్ని తీసుకోవడంలో పూర్తి దేశం దృఢ నిశ్చయంతో ఉంది" అని ఆయన ప్రధానంగా చెప్పారు. మానవజాతి పట్ల నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరు ఈ ఘడియల్లో భారత్ వెన్నంటి నిలబడ్డారని కూడా ఆయన అన్నారు. భారత్కు మద్దతిచ్చిన ప్రజలకు, వివిధ దేశాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

"అభివృద్ధి జోరందుకోవాలంటే శాంతి, భద్రతల పరిరక్షణ అత్యంత ఆవశ్యకం" అని శ్రీ మోదీ అన్నారు. భారత్ అభివృద్ధి చెందాలంటే బీహార్ అభివృద్ధి పథంలో పయనించడం ఎంతో అవసరం అని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్లో అభివృద్ధికి పూచీపడేందుకు, ప్రగతి ఫలాలను రాష్ట్రంలో ప్రతి ఒక్క వర్గం వారికీ, ప్రతి ఒక్క ప్రాంతానికీ అందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని చెబుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాలుపంచుకొన్నందుకు ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ గవర్నరు శ్రీ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, బీహార్ ముఖ్యమంత్రి శ్రీ నీతీశ్ కుమార్, కేంద్ర మంత్రులు శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, శ్రీ జీతన్ రామ్ మాంఝీ, శ్రీ గిరిరాజ్ సింగ్, శ్రీ చిరాగ్ పాశ్వాన్, శ్రీ నిత్యానంద్ రాయ్, శ్రీ రామ్ నాథ్ ఠాకుర్, డాక్టర్ రాజ్ భూషణ్ చౌధరి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేపథ్యం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్లోని మధుబనిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఉత్తమ పనితీరును కనబరచిన పంచాయతీలను గుర్తించడమే కాక వాటికి ప్రోత్సాహకాన్ని అందించడంలో భాగంగా జాతీయ పంచాయతీ పురస్కారాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రదానం చేశారు.

సుమారు రూ.340 కోట్ల ఖర్చుతో బీహార్లోని గోపాల్గంజ్ జిల్లా హథువాలో ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంటు, రైళ్లలో నుంచి సరుకును దింపుకొనే సదుపాయం నిర్మాణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఇది సరఫరా వ్యవస్థను సువ్యవస్థితం చేయడంలో సహాయకారిగా ఉండడంతోపాటు ఎల్పీజీని పెద్ద ఎత్తున రవాణా చేసే సామర్థ్యాన్ని కూడా మెరుగుపరచనుంది.

ఈ ప్రాంతంలో విద్యుత్తు సంబంధిత మౌలిక సదుపాయాలను పెంచడం కోసం రూ.1,170 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీంలో భాగంగా బీహార్లో విద్యుత్తు రంగంలో రూ.5,030 కోట్లకు పైగా వ్యయంతో పూర్తి చేసిన అనేక ప్రాజెక్టులను కూడా ఆయన ప్రారంభించారు.

దేశంలో రైలు సేవల సదుపాయాన్ని పెంపొందించాలన్న తన నిబద్ధతకు అనుగుణంగా ప్రధానమంత్రి సహర్సా, ముంబయిల మధ్య 'అమృత్ భారత్ ఎక్స్ప్రెస్'ను, జయ్నగర్, పట్నాల మధ్య 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'ను ప్రారంభించారు. వీటికి అదనంగా పిప్రా, సహర్సాల మధ్య, ఇంకా సహర్సా, సమస్తిపుర్ ల మధ్య తిరిగే రైళ్లను ప్రధాని ప్రారంభించారు. ఆయన సుపౌల్ పిప్రా రైల్ లైనును, హసన్పుర్ బిథాన్ రైల్ లైనును, ఛప్రా, బగహాలలో రెండు దారుల రైల్ ఓవర్ బ్రిడ్జిలను కూడా ప్రారంభించారు. ఖగరియా-అలౌలీ రైల్ లైనును దేశ ప్రజలకు ప్రధాని అంకితమిచ్చారు. ఈ ప్రాజెక్టులు సంధానాన్ని మెరుగుపరచడంతో పాటుఈ ప్రాంతం సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తోడ్పడనున్నాయి.

కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్లో భాగంగా దాదాపు రూ.930 కోట్ల విలువైన ప్రయోజనాలను ప్రధాని 2 లక్షలకు పైచిలుకు స్వయం సహాయక బృందాలకు పంపిణీ చేశారు. ఈ ప్రయోజనాలు దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ ఉపాధుల మిషన్ (డీఏవై- ఎన్ఆర్ఎల్ఎం)లో ఒక భాగంగా లెక్కకు వస్తాయి. పీఎంఏవై -గ్రామీణ్ పథకంలో 15 లక్షల మంది కొత్త లబ్ధిదారులకు ప్రధాని మంజూరు లేఖలను అందజేశారు. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది పీఎంఏవై-జీ లబ్ధిదారులకు కిస్తీలను కూడా ఆయన విడుదల చేశారు. బీహార్లో ఒక లక్ష పీఎంఏవై-గ్రామీణ్ ఇళ్లతో పాటు 54,000 పీఎంఏవై-యూ గృహాలకు సంబంధించి గృహప్రవేశాల ఘట్టానికి సూచికగా కొంతమంది లబ్ధిదారులకు ఇంటి తాళంచెవులను కూడా ప్రధాని అందించారు.

పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.. డీఎంహెచ్ ఓ రాజశ్రీ

నిజామాబాద్, ఏప్రిల్ 25: ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తద్వారా రోగాలు దరి చేరవని డీఎంహెచ్ఓ రాజశ్రీ తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ పట్టణంలోని స్థానిక దుబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా దుబ్బ ప్రాంత వీధుల్లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా దోమల నివారణపై, మనందరి పంతం.. దోమల అంతం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం, నీటి నిల్వలను తొలగించండి, మన ఆరోగ్యం మన చేతుల్లో, దోమలు పుట్టకుండా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి, దోమతెరలను వాడండి అంటూ నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ అనంతరం దుబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు లాంటి వ్యాధులను అరికట్టాలని సూచించారు. ఆశాలు, ఏఎన్ఎంలు ప్రతిరోజు గృహ సందర్శనలో ఏ రకమైన జ్వరం అయినా రక్త నమునాలు సేకరించి, మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలని తెలియజేశారు. అదేవిధంగా ఫీవర్ సర్వేను నిర్వహిస్తూ ప్రతి శుక్రవారం నీటి నిల్వలను తొలగించు టకై ఫ్రైడే, డ్రైడే ని నిర్వహించాలని డీఎంహెచ్ ఓ సూచించారు.

జిల్లా కీటక జనీత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ? జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా ఒక్క మలేరియా కేసు నమోదు కాలేదని, మలేరియా నిర్మూలనకై పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుండి ఒక్క మలేరియా కేసు నమోదు కాని మూడు జిల్లాల్లో నిజామాబాద్ ఒకటి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణీలు డా. శ్రీలత, డా. సుసేన, డా.శిఖర, డా.చంద్రకళ, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ మలేరియా అధికారి మహమ్మద్ సలీం, సబ్ యూనిట్ అధికారి గోవర్ధన్, హెచ్ఇఓ లు నటరాజ్, సంతోష్, లింగారెడ్డి, నాగరాజు, ఆరోగ్య పర్యవేక్షకులు శాంతాకుమారి, స్వామి, మధు సూదన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ పట్ల అసభ్య ప్రవర్తన.. నిందితుడికి మూడేళ్ల జైలు

అమరావతి, ఏప్రిల్ 25:మైనర్ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయస్థానం మూడు సంవత్సరాల జైలు శిక్షణ విధించింది. 2019 జూన్ 5న, కృష్ణలంకపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మైనర్ బాలిక పాఠశాలకు నడుచుకుంటూ వెళుతుండగా, ఒక వ్యక్తి ఆ బాలికతో, ఆమె స్నేహితులతో అసభ్యంగా ప్రవర్తించాడు.

ఆ బాలిక భయంతో పారిపోయి జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. ఆ తర్వాత వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా, పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన నిందితుడు పాటల దేవిడ్ పవన్ కుమార్ను అప్పటి కృష్ణ లంక ఎస్.ఐ. బి.సత్యనారాయణ అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.నిందితుడుపై నేరం రుజువు కావడంతో.. విజయవాడ పోక్స్ కోర్టు న్యాయమూర్తి వి.భవాని తీర్పును ప్రకటించారు. నిందితుడికి ఇరవై వేల రూపాయల జరిమానాతో పాటు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు.

ముజఫర్ నగర్లో కార్డన్ సెర్చ్

కర్నూల్ , ఏప్రిల్ 25:కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలపై కర్నూలు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అసాంఘీక శక్తులకు అడ్డుకట్ట వేసి నేరరహిత జిల్లాగా తీర్చిదిదాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. ఈసందర్భంగా శుక్రవారం కర్నూల్ డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు సబ్ డివిజన్ సిఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ, ఆర్ముడు పోలీసులు బృందాలుగా ఏర్పడి కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముజఫర్ నగర్ లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్స్, అనుమ

దేశంలో భూగర్భ గని తవ్వకాలకు ఊతమిచ్చేందుకు ప్రోత్సాహకాలు ప్రకటించిన బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:భారతీయ బొగ్గు రంగాన్ని మరింత ప్రోత్సహించడంలో భాగంగా- భూగర్భ బొగ్గు తవ్వకాలను పెంచే లక్ష్యంతో బొగ్గు మంత్రిత్వ శాఖ నూతన విధానాలను పరిచయం చేసింది. అధిక మూలధన పెట్టుబడి, గరిష్ట ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకొనే ప్రయాణంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు ఈ సాహసోపేతమైన సంస్కరణలు తీసుకొచ్చారు. ఇవి సుస్థిరాభివృద్ధి సాధించాలనే విస్తృత లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు రంగాన్ని ఆధునికీకరించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేస్తున్నాయి.

భూగర్భ బొగ్గు తవ్వకాల్లో వృద్ధిని/ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి ప్రోత్సాహకాలను బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రకటించింది:

1. ఫ్లోర్ ఆదాయ వాటా తగ్గింపు: భూగర్భ బొగ్గు గనుల్లో వచ్చే ఆదాయ వాటాలో ఫ్లోర్ శాతాన్ని 4 నుంచి 2 శాతానికి తగ్గించింది. ఈ లక్ష్య తగ్గింపు గణనీయమైన ఆర్థిక ఉపశమనాన్ని అందిస్తుంది. అలాగే భూగర్భ ప్రాజెక్టుల ఆర్థిక శక్తిని సైతం పెంపొందిస్తుంది.

2. ముందస్తు చెల్లింపుల మాఫీ: భూగర్భ తవ్వకాలు చేపట్టే సంస్థలకు ముందస్తు చెల్లింపులు తప్పనిసరిగా చేయాలన్న నిబంధనను పూర్తిగా తొలగించారు. ఈ చర్య ఆర్థిక అవరోధాన్ని తొలగించి, ప్రైవేటు రంగ భాగస్వామ్యం విస్తరించేలా ప్రోత్సహిస్తుంది. అలాగే ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసే అవకాశం ఇస్తుంది.

భూగర్భ బొగ్గు బ్లాకుల్లో సురక్షితమైన కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అందిస్తున్న 50 శాతం రిబేటుకు ఈ ప్రోత్సహాకాలు అదనం. ఇవి సమష్టిగా ప్రాజెక్టు అమలును సులభతరం చేస్తాయి.

ఈ సంస్కరణల ఆధారిత విధానం భవిష్యత్తు అవసరాలను తీర్చే, పెట్టుబడి అనుకూలమైన, ఆవిష్కరణల ఆధారంగా నడిచే బొగ్గు రంగాన్ని ప్రోత్సహించడంలో బొగ్గు మంత్రిత్వ శాఖకున్న అంకితభావాన్ని తెలియజేస్తుంది. అలాగే భూగర్భ గనుల తవ్వకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రభుత్వం పెంపొందిస్తుంది. అదేవిధంగా, ఈ రంగాన్ని అత్యధిక సామర్థ్యం, భద్రత, ఉపాధి కల్పన దిశగా నడిపిస్తోంది.

భూగర్భ బొగ్గు మైనింగ్ పర్యావరణ అనుకూలం. ఓపెన్ కాస్ట్ కార్యకలాపాలతో పోలిస్తే ఉపరితల భూభాగానికి చాలా తక్కువ నష్టాన్ని కలిగిస్తుంది. ఈ విధాన చర్యలు పర్యావరణ సమతుల్యాన్ని సంరక్షించే కంటిన్యుయస్ మైనర్లు, లాంగ్ వాల్ వ్యవస్థలు, రివోట్ సెన్సింగ్ పరికరాలు, ఏఐ ఆధారిత భద్రతా వ్యవస్థలు, తదితర అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించేలా ప్రోత్సహిస్తాయి.

పర్యావరణహితమైన, సుస్థిరమైన బొగ్గు వెలికితీసే పద్ధతులను అనుసరించే దిశగా తీసుకున్న వ్యూహాత్మక చర్యగా ఈ పురోగతి ఆధారిత సంస్కరణలను వర్ణించవచ్చు. భూగర్భ మైనింగ్‌లో భారత్ సామర్థ్యాన్ని వెలికితీయడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి, జాతీయ ఇంధన భద్రత, ఆత్మనిర్భర భారత్ లక్ష్యాల సాధనకు సహకారం అందించడమే వీటి లక్ష్యం.

కొత్తగా మూత్ర పిండాలను పొందిన రోగుల్లో 95 శాతం మంది జీవించి ఉన్నారు...

దానానంతరం రోగులు జీవించి ఉన్న సందర్భాలు 97 శాతం...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:రాయ్ పూర్ లోని ఎయిమ్స్ వైద్య విద్యా సంస్థ తొలిసారిగా వినిమయ విధానంలో (స్వాపింగ్) మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో ఫలప్రదంగా పూర్తి చేసింది. స్వాప్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అనేది 'కిడ్నీ పెయిర్డ్ ట్రాన్స్‌ప్లాంట్' (కేపీటీ)గా కూడా వ్యవహారంలో ఉంది. ఈ ఘనతను సాధించిన కొత్త ఎయిమ్స్ సంస్థల్లో మొదటిదిగాను, సంక్లిష్టమైన, ప్రాణాలను కాపాడే ప్రక్రియలో సఫలమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే మొదటి ప్రభుత్వ ఆసుపత్రిగాను ఎయిమ్స్ రాయ్‌పుర్ రికార్డు సృష్టించింది.

ఈ మూత్ర పిండ మార్పిడి సఫలం కావడంతో ఈ తరహా మార్పిడుల సంఖ్య 15 శాతం వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. దీనిలో ఉన్న అవకాశాలను గుర్తిస్తూ, అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ స్వాప్ డోనర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆచరణలోకి తీసుకురావాల్సిందిగా నేషనల్ ఆర్గనైజేషన్ - టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్ఓటీటీఓ) సిఫారసు చేసింది. ఈ ఐచ్ఛికానికి వీలు కల్పించడం వల్ల దాతలు మరింత మంది ముందుకు వచ్చేందుకు ఆస్కారం ఉంది. దేశవ్యాప్తంగా ఈ తరహా ఆపరేషన్లకు ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో- యూనిఫాం వన్ నేషన్ స్వాప్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామును అమలుచేయాలని కూడా ఎన్ఓటీటీఓ నిర్ణయించింది.

స్వాప్ ట్రాన్స్‌ప్లాంట్ (మూత్ర పిండాల వినిమయం)లో మూత్ర పిండాలు పనిచేయడం మానేసిన రోగికి ఆ అవయవాన్ని దానం చేయడానికి ఎవరైనా సిద్ధపడి ముందుకు వచ్చినప్పటికీ- ఆ వ్యక్తి రక్తం గ్రూపుతో సరిపోలని రక్తం ఇవతలి వ్యక్తిది అయినప్పుడు, లేదా ఇవతలి వ్యక్తి దేహంలో హెచ్ఎల్ఏ రోగనిరోధక కణాలు ఆ శరీరావయవాన్ని తిరస్కరించే ప్రమాదం పొంచి ఉన్నప్పుడు- అవయవ వినిమయ - శస్త్రచికిత్సను ఆశ్రయించేందుకు అవకాశం ఉంటుంది. దీనికోసం స్వీకర్త తనకు దానంగా లభించిన అవయవాలను వేరే అవసరార్థులతో మార్పు చేసుకోవాలి. ఈ రకమైన సర్దుబాటు ద్వారా, స్వీకర్తలిద్దరూ తమ ఒంటికి సరిపడే కిడ్నీలను పొందగలుగుతారు. ఇలాంటి స్థితిలో రోగులు ఇరువురికీ వినిమయ విధాన శస్త్రచికిత్స విజయవంతంగా ముగుస్తుంది.

ఎయిమ్స్ రాయ్‌పుర్ చేజిక్కించుకొన్న ఈ చరిత్రాత్మక విజయాన్నిప్పుడు పరిశీలిద్దాం... బిలాస్‌పుర్ నివాసులైన 39 ఏళ్లు, 41 ఏళ్ల వయసున్న ఇద్దరు ఈఎస్ఆర్‌డీ పురుష రోగులు మూడు సంవత్సరాలుగా డైయాలిసిస్ (రక్తశుద్ధి) చేయించుకొంటున్నారు. ఇద్దరికీ మూత్ర పిండాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోగులకు మూత్ర పిండాలను దానం చేయడానికి వారివారి భార్యలు ముందుకు వచ్చారు. అయితే, బ్లడ్ గ్రూపులు వేర్వేరుగా ఉన్నాయి. అంటే ఒక జోడీ బ్లడ్ గ్రూపు బీ+, ఓ+ కాగా, రెండో జోడీ ఓ+, బీ+ బ్లడ్ గ్రూపు ఉన్న కారణంగా నేరుగా దానం చేయడానికి అవకాశం లేదు. ఈ సవాలును ఎయిమ్స్ రాయ్‌పుర్ వైద్య బృందం ఒక పరిష్కారాన్ని కనుగొన్నది. ప్రతి మహిళా దాత తన మూత్ర పిండాన్ని రెండో స్వీకర్తకు ఇచ్చారు. దీంతో బ్లడ్ గ్రూపుల మధ్య సమన్వయం సాధ్యం అయింది. ఇలా చేసినందువల్ల ఇద్దరు రోగులకూ ప్రాణరక్షణకు అవసరమైన అవయవాలను సేకరించడానికి మార్గం ఏర్పడింది. రోగుల శస్త్ర చికిత్సను ఈ ఏడాది మార్చి నెల 15న నిర్వహించారు. దీంతో నలుగురు వ్యక్తులు.. దాతలూ, స్వీకర్తలూ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. ఆధునిక వైద్య సంరక్షణలో ఎయిమ్స్ రాయ్‌పుర్ తన సామర్థ్యాలను అంతకంతకు పెంచుకొంటోందని, చాలా కాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న రోగులకు వినూత్న పద్ధతుల్లో చికిత్స చేసి వారిని ఆరోగ్యవంతులుగా చేయాలన్న తన నిబద్ధతను చాటుకున్నది. అవయవ మార్పిడి చేసి వేరే వ్యక్తులకు అమర్చే బృందంలో ట్రాన్స్ ప్లాంట్ వైద్యుడు డాక్టర్ వినయ్ రాతౌడ్, ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ అమిత్ ఆర్. శర్మ, డాక్టర్ దీపక్ బిస్వాల్, డాక్టర్ సత్యదేవ్ శర్మ, ఎనస్థీషియా డాక్టర్లు జితేంద్ర, సరిత రాంచందానిలే కాకుండా ట్రాన్స్‌ప్లాంట్ సమన్వయ బృంద సభ్యులు, ఓటీతో పాటు ట్రాన్స్‌ప్లాంట్ నర్సింగ్ సిబ్బంది కూడా సభ్యులుగా ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఒకరి శరీర అవయవాలను మరొకరికి అమర్చే వైద్య విధానాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఎయిమ్స్ రాయ్‌పుర్ కీలక పాత్రను పోషించింది. మూత్ర పిండాలను వేరొకరికి అమర్చే విషయంలో ఈ సంస్థ ఒక కార్యక్రమాన్ని విజయవంతంగా అభివృద్ధిపరచగలిగింది. దీనిలో జీవించి ఉన్న దాత, చనిపోయిన దాత.. ఇలాగ రెండు విధాలైన దాతల శరీర భాగాలను ట్రాన్స్ ప్లాంట్ చేసే ప్రక్రియలు ఉన్నాయి. కనుమూసిన ఆరుగురు దాతలు తమ అవయవాలను గత రెండేళ్ల వ్యవధిలో అవయవదానం చేయడానికి నిశ్చయించుకున్నారు.

చనిపోయిన వ్యక్తి శరీరంలోని అవయవాలను దానంగా ఇచ్చిన, మృత వ్యక్తి మూత్ర పిండాన్ని అవసరమైన మరో మనిషికి అమర్చిన కొత్త 'ఎయిమ్స్' ఆస్పత్రుల్లో- ఎయిమ్స్ రాయ్‌పుర్ మొదటిది. విగతజీవుడైన దాతకు చెందిన మూత్ర పిండాన్ని శిశువుకు అమర్చే ప్రక్రియను మొదలుపెట్టిన రాష్ట్ర మొట్టమొదటి ఎయిమ్స్ కూడా ఇదే. ఇంత వరకు, ఈ సంస్థ 54 మూత్ర పిండాలను వేరే వ్యక్తులకు అమర్చింది. వీటిని పొందిన రోగుల్లో 95 శాతం మంది ప్రస్తుతం జీవించి ఉన్నారు. అలాగే, అవయవ దానం చేసిన తరువాత కూడా రోగులు జీవించి ఉన్న సందర్భాల 97 శాతంగా లెక్కతేలింది. ఈ గణాంకాలు ఈ సంస్థ కున్న రోగచికిత్స సంబంధిత ప్రావీణ్యాన్ని, రోగికి అత్యుత్తమ స్థాయి సంరక్షణ సేవల్ని అందించాలన్న సంస్థ నిబద్ధతను తెలియజేస్తున్నాయి.

ఎన్టీఆర్ యూనివర్సిటీ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ గా చంద్రశేఖర్

అమరావతి, ఏప్రిల్ 25:ఎన్టీఆర్ యూనివర్సిటీ హెల్త్ సైన్సెస్ విజయవాడ వైస్ చాన్సలర్ గా ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. పుల్లల చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈయన పదవీకాలం 3 సం.లు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్డియాలజీ, సామాజిక రంగంలో విశేష సేవలు..

ప్రభుత్వ వైద్యునిగా 35 ఏళ్ల సర్వీస్ లో ఎంతో మందికి కార్డియాక్ పేషెంట్లకు ప్రాణం పోశారు. 2003లో డాక్టర్ పి. చంద్రశేఖర్ కర్నూలు మెడికల్ కాలేజీ కార్డియాలజీ విభాగం ఊఆ గా బాధ్యతలు స్వీకరించడంతో ఈ విభాగం స్వర్ణయుగం ప్రారంభమైంది. 2003లో డాక్టర్ పి. చంద్రశేఖర్ ప్రారంభించిన కర్నూలు హార్ట్ ఫౌండేషన్, ప్రజల ప్రయోజనం కోసం ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోంది. 2008లో ఊఆ చేసిన అనేక ప్రయత్నాలు తర్వాత ఇన్వేసివ్ కార్డియాక్ క్యాత్‌లాబ్ ప్రారంభం, ఈ ప్రాంతంలోని పేద ప్రజలకు సేవలను విస్తరించడానికి మార్గం సుగమం చేసింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ఈయన ప్రస్థానం చిరస్మరణీయం. దివంగత రాష్ట్రపతి ఏ.పి.జే.అబ్దుల్ కలాం నుంచి కూడా ఈయన ప్రశంసలు అందుకున్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ నుంచి సర్టిఫికేట్ ఆఫ్ కమిట్మెంట్ కూడా అందుకున్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేదిక బాల భవన్.. డీఈఓ అశోక్

నిజామాబాద్, ఏప్రిల్ 25:పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాల భవన్ ఒక వేదిక అని డీఈఓ అశోక్ అన్నారు. శుక్రవారం నగరంలోని బాల భవన్ లో నిర్వహించిన ప్రత్యేక వేసవి శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి పార్థి అశోక్ హాజరై నటరాజ విగ్రహానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారి మానసిక ఉల్లాసానికి జిల్లా బాలభవన్ పని చేస్తుందన్నారు. సంవత్సరం పొడువునా పుస్తకాలతో కుస్తీ పడుతున్న పిల్లలకు ఈ శిక్షణ ఆటవిడుపన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ఆటపాటలతో పాటు, సంగీతం, నృత్యం చిత్రలేఖనం, మ్యాజిక్, నీతి కథలు, యోగా, నాటకం, స్కేటింగ్, టైలరింగ్, కర్రసాము మొదలగు 30 రకాల అంశాల్లో వారికి నచ్చిన అంశాల్లో వారు శిక్షణ తీసుకోవచ్చన్నారు.

బాలభవన్ ఇన్చార్జి సూపరింటెండెంట్ మల్లాది ఉమా బాల, రివార్డ్స్ ప్రత్యేక వేసవి శిక్షగా తరగతుల ఇన్ చార్జిగా వ్యవహరిస్తున్న రిటైర్డ్ బాలభవన్ సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్, బాలభవన్ శిబ్బంది సేవలను డీఈవో అభినందించారు. మెజీషియన్ జాదూ యుగంధర్ రంగనాథ్ చూపీన ఇంద్రజాల అంశాలు విశేషంగా ఉన్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ సిబ్బంది వెంకట లక్ష్మి, పుష్పలత, లక్ష్మణ్, శ్వేత, శ్రీలత, లలిత, సమ్రత, సోనాలి, గణేష్ తదితరులు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 680 మంది పిల్లలు పాల్గొనటం అతిపెద్ద సంఖ్య అని డీఈవో ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజావాణి తాత్కాలికంగా రద్దు.. కలెక్టర్ ప్రతీక్ జైన్

హైదరాబాద్, ఏప్రిల్ 25:: ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశం హాలులో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం తెలిపారు.జిల్లాలో భూ భారతి రైతు అవగాహనా కార్యక్రమాలు ఉండడంతో ఈనెల 28న జరగాల్సిన ప్రజావాణిని వాయిదా వేశామన్నారు. తదుపరి మే నెల 5వ తేదీ నుంచి తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని, కలెక్టరెట్ కార్యాలయానికి ప్రజలు ఎవ్వరు కూడా రాకూడదని కలెక్టర్ కోరారు.

ఢిల్లీ నూతన మేయర్‌గా రాజా ఇక్బాల్ సింగ్ ఎంపిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కు నూతన మేయర్ గా బీజేపీ సీనియర్ నాయకుడు , మాజీ మేయర్ రాజా ఇక్బాల్ సింగ్ ఎంపియ్యారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్ పోస్టును కూడా బీజేపీ కైవసం చేసుకుంది. బీజేపీ అభ్యర్థి జైభగవాన్ యాదవ్ డిప్యూటీ మేయర్ గా ఎన్నికయ్యారు. ఇప్పటికే కేంద్రంలో, ఢిల్లీలో బీజేపీ అధికారంలో ఉంది. ఇప్పుడు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారం కూడా బీజేపీకే దక్కింది. దాంతో ఎంసీడీలో త్రిపుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటైనట్లయ్యింది.

కాగా ఎంసీడీలో మొత్తం సంఖ్య 250. అందులో నుంచి 11 మంది ఎమ్మెల్యేలుగా, ఒకరు ఎంపీగా ఎన్నికయ్యారు. దాంతో ప్రస్తుతం 238 మంది సభ్యులు ఉన్నారు. అందులో బీజేపీ సభ్యులు 117 మంది, ఆప్ సభ్యులు 113 మంది. మిగతా 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. వీరికి తోడు ఢిల్లీకి చెందిన ఏడుగురు లోక్‌సభ సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు, ఢిల్లీ స్పీకర్ వీరేంద్ర సచ్‌దేవ నామినేట్ చేసిన 14 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

సంఖ్యా బలం తక్కువగా ఉన్న కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఈ మేయర్ ఎన్నికల్లో పోటీపడలేదు. ఇవాళ జరిగిన ఓటింగ్‌ను కూడా ఆప్ బహిష్కరించింది. బీజేపీకి 117 మంది కౌన్సిలర్‌లతోపాటు 10 మంది ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేల బలం ఉంది. అంటే బీజేపీ మొత్తం బలం 134గా ఉంది. దాంతో బీజేపీ గెలుపు కాయమని తేలిపోయింది. అందుకే ఆప్ పోటీకి, ఓటింగ్‌కు దూరంగా ఉంది.

ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో యాదగిరిగుట్టలో వ్యక్తి మృతి!

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 25 :ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం యాదగిరిగుట్టలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకి చెందిన అన్నారం శివశంకర్ (26) పట్టణంలోని యోగానంద నిలయంలో వెనుక ప్రాంతంలో సెలూన్ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం కడుపునొప్పితో పాటు ఛాతి పట్టివేస్తున్నట్లుగా అనిపించడంతో స్థానికంగా ఉన్న ప్రశాంత్ నర్సింగ్ హోమ్‌కు వెళ్లాడు. వెంటనే అక్కడి ఆర్ఎంపీ వైద్యుడు ఉపేందర్ కడుపునొప్పికి సంబంధించి చికిత్స చేశాడు. కడుపునొప్పి తగ్గడంతో మూత్రం వస్తుందని బెడ్ పైనుండి లేచి వెళ్తున్న క్రమంలో శివశంకర్ ఒక్కసారిగా కుప్పకులాడు.

ఆర్ఎంపీ వెంటనే అప్రమత్తమై వ్యక్తికి ఆక్సిజన్ అందిస్తూ గంటపాటు పరిశీలనలో ఉంచాడు. కాగా నొప్పి తగ్గక పోవడంతో పాటు చాతి కుడి వైపు విపరీతంగా నొప్పికి గురికావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆలస్యంగా గుండెనొప్పిని పసిగట్టిన వైద్యుడు మెరుగైన చికిత్స కోసం భువనగిరికి తరలించాలని సూచించాడు. బంధువులు 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ అలస్యంగా వచ్చింది. అదే అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు.

మృతదేహంతో ఆస్పత్రి వద్ద బైఠాయింపు

శివశంకర్ మృతికి ప్రశాంత్ నర్సింగ్ హోం డైరక్టర్, ఆర్ఎంపీ వైద్యుడు ఉపేందర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు మృతదేహంతో ఆస్పత్రి వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. శివశంకర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందంటూ, కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు వైద్యుడు ఉపేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఈ విషయమై వైద్యుడిని వివరణ కోరగా శివశంకర్ కడుపునొప్పి, ఛాతి బరువుగా ఉందని ఆస్పత్రి రాగా చికిత్స అందించా. వెంటనే కడుపునొప్పికి సంబంధించిన ఇంజక్షన్‌ను గ్లూకోజ్ బాటిళ్లతో కలిపి ఇచ్చా. మొదటగా నొప్పి తగ్గిందని చెప్పాడు. ఆ వెంటనే ఛాతి నొప్పి అంటూ వివరీతంగా ఇబ్బంది పడ్డాడు. 20 నిమిషాల అనంతరం అతనికి గుండె నొప్పి అని పసిగట్టా. వెంటనే మెరుగైన వైద్యం కోసం భువనగిరికి తరలించాలని సూచించా. అంబులెన్స్ అలస్యంగా వచ్చింది. ఒక వైద్యుడిగా తాను చేయాల్సింది చేసినట్లు, తన తప్పేమి లేదని తెలిపాడు.

భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.60 లక్షలు, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

ఊట్కూర్, ఏప్రిల్ 25: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల్లో భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం నారాయణపేట ఆర్డీవో రామచందర్ ఊట్కూర్ మండల తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని త్రిప్రాన్ పల్లి, బాపురం శివారు గ్రామాల్లో ఓపెన్ కెనాల్ , పైపులైన్ , సంప్ హౌస్ నిర్మాణాల్లో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులు హాజరయ్యారు.

ఆర్డీవో మాట్లాడుతూ .. పేట, కొడంగల్ ఎత్తిపోతల్లో భాగంగా భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా ఊట్కూర్ పెద్ద చెరువు, నారాయణపేట మండలం పేరపల్ల జాయమ్మ చెరువుకు సాగునీరు అందించేందుకు సర్వే పనులు పూర్తి చేశామన్నారు. సర్వే పట్ల రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందించి ఆదుకుంటామని తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ విలువ ఆధారంగా ఎకరాకు రూ. 60 లక్షలు చెల్లించాలని, లేనిపక్షంలో భూమికి బదులు భూమిని కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాల్లో నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆర్డీవోను కోరారు. ఓపెన్ కెనాల్, పైప్ లైన్ నిర్మాణం కోసం చేపట్టిన సర్వే నెంబర్లు, సాగులో ఉన్న వ్యవసాయ పొలాల విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, రైతుల సమక్షంలో రీ సర్వే నిర్వహించి తగిన న్యాయం చేయాలని అన్నారు.తమ తాతల కాలం నాటి వ్యవసాయ భూములను కోల్పోతే భవిష్యత్తులో తమ కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ చింత రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే.. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్లే స్కూల్ విద్య

హైదరాబాద్, ఏప్రిల్ 25: హైదరాబాద్ నగరంలో అంగన్‌వాడీ కేంద్రాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పేద పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ అక్షరాభ్యాసానికి పరిమితమైన అంగన్వాడి కేంద్రాల్లో ఇటీవల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అట్టహాసంగా జరుపుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు ఆయా కేంద్రాలలో అక్షరాభ్యాసం పూర్తి చేసుకున్న ఐదేళ్లలోపు పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు చేయిస్తున్నారు.

ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో గ్రేడ్లు ప్రకటించి గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రహమత్ నగర్ డివిజన్ నేతాజీ సుభాశ్ చంద్రబోస్ నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ సెంటర్లలో ప్లే స్కూల్ విద్యను అందిస్తున్నారని.. పేద, సామాన్య ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. లక్షలాది రూపాయలు వెచ్చించి అప్పుల పాలు కావద్దని సూచించారు.

ఇది రాజకీయ అంశం కాదు.. జాతీయ సమస్య: ఓవైసీ

హైదరాబాద్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని భారత్ తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే భారత్ ప్రతీకార చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ సమావేశానికి తమ పార్టీని ఆహ్వానించకపోవడంపై ఎంపి అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. ఈ విషయంపై బుధవారం రాత్రి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో మాట్లాడానని చెప్పిన ఆయన.. ఐదు నుంచి 10 మంది ఎంపిలు ఉన్న పార్టీలనే సమావేశానికి ఆహ్వానిస్తున్నారని రిజిజు చెప్పినట్లు తెలిపారు. తక్కువ ఎంపిలు ఉన్న పార్టీలను ఎందుకు ఆహ్వానించరని అడిగితే.. అందరిని పిలిస్తే.. ఎక్కువ సమయం పడుతుందని.. అందుకే పిలవడం లేదని చెప్పినట్లు ఓవైసీ పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ.. 'ఇది కేవలం బిజెపి లేదా ఇతర పార్టీల అంతర్గత సమావేశం కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే అఖిలపక్ష భేటీ. దీని ద్వారా మనం గట్టి సందేశం ఇవ్వాలి. అఖిలపక్షల సూచనలకు ప్రధాని ఓ గంట సమయం కేటాయించలేరా? మీ సొంతపార్టీకే మెజారిటీ లేదు.

పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి : డాక్టర్ భూక్య నగేశ్

నల్గొండ, ఏప్రిల్ 25:ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూర్యాపేట జిల్లా అర్వపల్లి పీహెచ్‌సీ డాక్టర్ భూక్య నాగేశ్ అన్నారు. అంతర్జాతీయ మలేరియా డే సందర్భంగా శుక్రవారం అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్

ఉగ్రవాద చర్యలను ఉపేక్షించరాదు..నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ముస్లిముల నిరసన ర్యాలీ

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 25: దేశంలో ఉగ్రవాద చర్యలకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉందని ముస్లిం సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం నమాజ్ అనంతరం కశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యను అనంతరం అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు హబీబుర్ రెహమాన్, యాకుబ్ బావజీర్, మహమ్మద్ ఖాదర్, మహ్మద్ నిజాం, మహమ్మద్ ఖాజా బాబా తదితరులు మాట్లాడారు. అకారణంగా 26 మంది అమాయకులు ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వారన్నారు. దేశంలో ఉగ్రవాద చర్యలకు ఉసిగొల్పుతున్న పాకిస్తాన్ లాంటి దేశాలపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని వారన్నారు.

అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఉగ్రవాదుల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ భూమిపై జీవించే హక్కు ప్రతి ఒక్కరిపై ఉందని అలాంటి హక్కులను హరించే ఉగ్రవాదులను ఉపేక్షించకూడదని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడడానికి ముస్లిం యువత ముందుకు వస్తారని , మిలిటరీలో ముస్లిములకు స్థానం కల్పించి పాకిస్తాన్ తో పోరాడడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల నాయకులు, ముస్లిం యువజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పహాల్గం ఉగ్ర దాడికి నిరసనగా దేవరకద్ర మండల కేంద్రంలోని జమియా మజీద్‌లో శుక్రవారం ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో పర్యటకులపై దాడిని తీవ్రంగా ఖండించారు. అమాయకులైన పర్యటకులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల ఆత్మ శాంతి కలగాలని మౌనం పాటించారు. యావత్ భారత వాణి ఇలాంటి ఘటనలను ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సోదరులు సయ్యద్ గౌస్, ఎం డి ఖదీర్ పాషా, ఎండీ జమీల్, ఖాజా కుతుబుద్దిన్, ఎండీ అయూబ్, ఖాదర్ సాహెబ్ జాహీద్, ఖలిద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు హారన్లుగా భారతీయ సంగీత శబ్దాలు మాత్రమే వచ్చేలా పరికరాలు

– కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఓ సరికొత్త ప్రతిపాదన

–త్వరలో చట్టం తేవాలని యోచన

న్యూ డిల్లీ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేంద్ర రోడ్డు, రవాణా శాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఓ సరికొత్త ప్రతిపాదన చేశారు. వాహనాలకు హారన్లు గా భారతీయ సంగీత పరికరాల శబ్దాలు మాత్రమే వచ్చేలా త్వరలో చట్టం తేవాలని యోచిస్తున్నట్లు చెప్పారు.నవభారత్ టైమ్స్ 78వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగించారు. అన్ని వాహనాలకు హారన్లుగా భారతీయ సంగీత పరికరాలు ఉత్పత్తి చేసే శబ్దాలనే వినియోగించేలా చట్టం తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఫ్లూట్, తబలా, వయోలిన్, హార్మోనియం వంటి వాయిద్య పరికరాల ద్వారా వచ్చే శబ్దాలు ఇందులో ఉంటాయని చెప్పారు. ఆయా ధ్వనులు వినడానికి ఎంతో హాయిగా ఉంటుందని తెలిపారు.ఇదే కార్యక్రమంలో వాయుకాలుష్యంపై కూడా నితిన్ గడ్కరీ మాట్లాడారు. దేశంలో మొత్తం వాయు కాలుష్యం రవాణా రంగం వాటా 40 శాతం వరకు ఉంటుందని చెప్పారు. దీన్ని ఎదుర్కొనేందుకు మోదీ ప్రభుత్వం మిథనాల్, ఇథనాన్‌తో నడిచే వాహనాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇక భారత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ బలాన్ని కూడా గడ్కరీ హైలెట్ చేశారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఎగుమతి ద్వారా దేశం గణనీయమైన ఆదాయాన్ని అర్జిస్తున్నట్లు చెప్పారు. 2014లో భారత ఆటోమొబైల్ రంగం విలువ రూ.14 లక్షల కోట్లు కాగా, ఇప్పుడు అది రూ.22 లక్షల కోట్లకు పెరిగినట్లు చెప్పారు. మన ఆటోమొబైల్ మార్కెట్ జపాన్‌ను అధిగమించి అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో నిలిచిందన్నారు

జైళ్లలో సంస్కరణలు,పునరావాస చర్యలు చేపట్టాలి

–కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు జాతీయ కారాగార ఆలోచనాపరుల వేదిక విజ్ఞప్తి

హైదరాబాద్ ఏప్రిల్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: జైళ్లలో సంస్కరణల ,పునరావాసం చేపట్టాలని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు జాతీయ కారాగార ఆలోచనాపరుల వేదిక విజ్ఞప్తి చేసింది గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చిసిన మెడియా సమావేశం లో ప్రిజన్ వరల్డ్ ఆర్గనైజేషన్ అద్యక్షులు తెలంగాణ జైళ్ల మాజీ డైరెక్టర్ జనరల్ ఐపిఎస్ (రిటైర్డ్) శ్రీ వి.కె.సింగ్ మాట్లాడుతూ జాతీయ కారాగార ఆలోచనాపరుల వేదిక అయిన ప్రిజన్ వరల్డ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ లో జాతీయ కారాగార మహాసభలు జరిగాయని తెలిపారు.. భారతదేశంలో జైళ్ల సంస్కరణలు, పునరావాసానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు జైలు, కరెక్షనల్ అధికారులు, ప్రస్తుత, రిటైర్డ్ జైళ్ల శాఖల అధిపతులు, సైకో సోషల్ వర్కర్లు, ఎన్జీవోలు, విద్యావేత్తలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఈ సదస్సు నిర్వహించడా జరిగిందని తెలిపారు.. 60 మందికి పైగా నిపుణుల మద్దతు మరియు చురుకైన భాగస్వామ్యంతో ప్రారంభించబడింది. కాన్ఫరెన్స్ ఈ క్రింది విధంగా ప్రధాన అంశాలను ఇందులో చర్చించడం జరిగినట్లు తెలిపారు.జైళ్ల శాఖలో వివిధ రాష్ట్రాల్లో 30 శాతం నుంచి 50 శాతం వరకు ఉన్న ఖాళీలు భర్తీ చేయాలని,× జైళ్లలో సంస్కరణలు/ పునరావాసం చేపట్టడానికి కరెక్షనల్ సిబ్బంది కొరతను తీర్చాలని,× జైలు సిబ్బంది మరియు ఖైదీల యొక్క పేలవమైన పని మరియు జీవన పరిస్థితులు మెరుగుపర్చాలని, రద్దీ మరియు పేలవమైన ఆరోగ్య మరియు మానసిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించాలని, చొరవ తీసుకోవడానికి జైలు సిబ్బందికి ప్రేరణ లేకపోవడం తో × జైళ్లలో మహిళలు, పిల్లలు, బయట కుటుంబ సభ్యుల పరిస్థితులు దాయనీయాంగ్ ఉండటం, జైళ్లలో ఖైదీలను నిమగ్నం చేయడానికి సేవలు/ సౌకర్యాలు/ పరిశ్రమలు లేకపోవడం, జైలు సిబ్బందికి సరైన శిక్షణ సౌకర్యాలు లేకపోవడం, విద్య, నైపుణ్య శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు లేకపోవడం వంటి అంశాలపై చర్చించిఉనట్లు తెలిపారు.జ్ఞాన భాగస్వామ్యంపై ఎక్కువ దృష్టి సారించే సాంప్రదాయ సమావేశాల మాదిరిగా కాకుండా, ఈ సమావేశం దేశవ్యాప్తంగా సంస్కరణ సంస్థలను సంస్కరించడానికి ఖచ్చితమైన కార్యాచరణ పాయింట్లకు ప్రాధాన్యత ఇచ్చింది.ఈ సదస్సుకు జైళ్లు, కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ కు సంబంధించిన వివిధ రంగాలకు చెందిన 65 మందికి పైగా నిపుణులు హాజరయినట్లు తెలిపారు.

డిజిలాకర్ ద్వారా క్రీడా సర్టిఫికేట్ల జారీని ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:డిజిలాకర్ ద్వారా క్రీడా ధ్రువీకరణ పత్రాల జారీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈరోజు ప్రారంభించారు.

దీనికి ముందు, అక్కడే నేషనల్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ రీసెర్చ్ (ఎన్సీఎస్ఎన్ఆర్)ను ఆయన ప్రారంభించారు.

నమామే శాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, అథ్లెట్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డాక్టర్ మాండవీయ పునరుద్ఘాటించారు. అథ్లెట్లను కేంద్రీకృతం చేస్తూ మోదీ ప్రభుత్వం అనేక క్రీడా కార్యక్రమాలను చేపట్టిందన్నారు. జాతీయ క్రీడా పాలన బిల్లు 2024 ముసాయిదా, జాతీయ క్రీడా విధానం 2024 ముసాయిదా, క్రీడలలో వయస్సురీత్యా మోసాలను అరికట్టేలా జాతీయ నియమావళి ముసాయిదా (ఔఅంఆఈ)–2025లను ఉటంకిస్తూ.. భారత క్రీడా వ్యవస్థలో పారదర్శకత, న్యాయం, సుపరిపాలనను నెలకొల్పాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఇవి నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానించారు.

డిజిలాకర్ ద్వారా జారీ చేసిన క్రీడా ధ్రువీకరణ పత్రాలను త్వరలోనే నేషనల్ స్పోర్ట్స్ రిపోజిటరీ సిస్టమ్ (ఎన్ ఎన్ ఆర్ ఎన్)తో అనుసంధానిస్తామని, దాని ద్వారా ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా ప్రభుత్వ నగదు బహుమతులను నేరుగా అథ్లెట్ల బ్యాంకు ఖాతాల్లోకే పంపిణీ చేయడానికి వీలు కలుగుతుందని, దాంతో ప్రత్యేకంగా భౌతికంగా దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం ఉండదని ఆయన పేర్కొన్నారు.

"గతంలో ఏం జరిగేదంటే– ఓ క్రీడాకారుడు అంతర్జాతీయ పోటీలలో పతకాలు గెలిచిన తర్వాత ప్రభుత్వ నగదు పారితోషికం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. అథ్లెట్లు తమకు రావాల్సిన బహుమతిని పొందడంలో అడ్డంకులను ఎదుర్కోవడం నాకు ఇష్టం లేదు. అందుకే వారికోసం ఈ ప్రక్రియను సులభతరం చేయడానికే ఈ కార్యక్రమాలను రూపొందించాం. అతడు/ ఆమె అంతర్జాతీయంగా పతకం గెలవడాన్ని అందరూ చూశాక కూడా, వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరమేముంది'' అని మంత్రి అన్నారు.

భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడుతూ.. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడానికి భారత బిడ్ కు అనుగుణంగా అమలు చేస్తున్న సమగ్ర ప్రణాళిక గురించి డాక్టర్ మాండవీయ వివరించారు. 2030లో కామన్వెల్త్ క్రీడలను నిర్వహించడానికి కూడా భారత్ సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు.జాతీయ క్రీడా సమాఖ్యలు (ఎన్ఎస్ఎఫ్ లు), నిర్వహణ సమర్థత, అథ్లెట్ల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిస్తూ.. క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడానికి అథ్లెట్లు, సమాఖ్యలు, ప్రభుత్వం సమష్టిగా కృషి చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ దిశగా చర్యల్లో భాగంగా.. ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియం లోని కార్యాలయాన్ని ఆసక్తి గల జాతీయ క్రీడా సమాఖ్యల కోసం అందుబాటులో ఉంచుతామని ఆయన ప్రకటించారు.

సమాఖ్య సహకారాన్ని సులభతరం చేయడంతోపాటు క్రీడల అభివృద్ధికి ఆర్థిక సహాయాన్ని ఆకర్షించడం లక్ష్యంగా 'వన్ స్పోర్ట్?వన్ కార్పొరేట్' విధానాన్ని త్వరలో ప్రారంభిం చనున్నట్లు డాక్టర్ మాండవీయ ప్రకటించారు. అంతేకాకుండా, ప్రాధాన్య క్రీడా విభాగాల కోసం ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా ఒలింపిక్ శిక్షణ కేంద్రాలను అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు.

ఎన్సీఎస్ఎస్ఆర్ ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ మాండవీయ మాట్లాడుతూ.. క్రీడాకారుల అత్యుత్తమ ప్రదర్శనలను తీర్చిదిద్దుతూ, ఇది అత్యున్నత స్థాయి పరిశోధన, విద్య, ఆవిష్కరణలకు కేంద్రంగా నిలుస్తుందన్నారు. 2047 నాటికి వికసిత భారత్ కింద.. భారత దీర్ఘకాలిక క్రీడా లక్ష్యాలను సాకారం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని ఆయన స్పష్టం చేశారు.

"నవ భారత్ కోసం బలమైన క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి మనమందరం కలిసి కృషిచేద్దాం" అంటూ డాక్టర్ మాండవీయ ముగించారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ఒలింపిక్ రజత పతక విజేత, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కార గ్రహీత మీరాబాయి చాను ఇలా అన్నారు: – "క్రీడాకారుల కోసం నిజంగా ఇదొక మంచి పథకం. డిజిలాకర్ ద్వారా క్రీడా ధ్రువీకరణ పత్రాల జారీ అన్నది నావంటి క్రీడాకారులకు చాలా ఒత్తిడిని దూరం చేస్తుంది. చాలా సార్లు క్రీడాకారులు – ప్రభుత్వ ఉద్యోగాలు, వీసా మొదలైన వాటిని పొందాలంటే కొన్ని పత్రాల కోసం హడావుడిగా ఇళ్లకు తిరిగి వెళ్ళవలసి వస్తుంది. ఎందుకంటే మనం వాటిని ఎప్పుడూ మనతో పట్టుకెళ్లలేం. ఈ కార్యక్రమంపట్ల క్రీడాకారులందరి తరఫునా మన క్రీడా మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను."

ఓల్డ్ సిటీలో వీసా గడువుదీరిన పాకిస్తానీలు, టూరిస్ట్‌గా వచ్చిన వ్యక్తులను తరిమివేయాలి

– హైదరాబాద్, పాతబస్తీలో అక్రమంగా నివాసముంటున్న స్లీపర్ సెల్స్ ను ఏరిపారేయాలి

–వరంగల్ ఉత్సవాల తర్వాత సేనాధిపతి తిరుగుబాటు తప్పదు

–మిషన్ కోసం ప్రారంభిస్తున్నామని చెప్పి.. కమిషన్ల పార్టీగా మిగిలిపోయిన బీఆర్ఎస్ పార్టీ

–నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల కోసమని చెప్పి కేవలం నలుగురికే పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ

–బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

హైదరాబాద్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పహల్గామ్ ఉగ్రోన్మాద సంఘటన దేశాన్ని కుదిపివేసిందని,పర్యాటకులపై పాశవిక పైశాచిక దాడితో.. మరీ మరీ ఎంచుకుని కాల్పులు జరిపినట్లుగా ఆ దాడి స్పష్టంగా కనపడిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ భారతదేశం అంతా ఈ సంఘటనను ఖండిస్తోందని, వివిధ రకాల నిరసనలు తెలియజేస్తూ, భారత్ మరింత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు. హైదరాబాద్ , పాత నగరంలో ఇప్పటికే వీసా గడువులు తీరి ఇంకా నివాసం ఉంటున్న అక్రమ వలసదారులు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీలు, టూరిస్ట్ గా వచ్చినటువంటి వ్యక్తులు, వీసా గడువుదీరిన పౌరులు కూడా ఉంటున్నారని సమాచారం పత్రికల్లో వచ్చింది.ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రాథమికంగా కొన్ని కఠిన నిర్ణయాలు ప్రకటించినందున ఓల్డ్ సిటీలో ఈ రకంగా ఉంటున్నటువంటి వ్యక్తులను పోలీసు యంత్రాంగం తరిమివేయాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. అందుకోసం పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వవల్సిన అవసరం ఉందని బిజెపి డిమాండ్ చేస్తోందన్నారు. ఎంఐఎం బీఆర్ఎస్ పార్టీతో కొంతకాలం దోస్తానా చేసింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తో కలిసి నడుస్తోంది. దీంతో నిస్సహాయ స్థితిలో పోలీసులు ఉన్నట్లుగా చాలా సందర్భాల్లో కనపడుతోంది. హైదరాబాద్ లో స్లీపర్ సెల్స్ ఉన్నారని అనేక సందర్భాల్లో ఎన్ఐఏ, ఐబీ హెచ్చరికలు జారీచేశాయి. వారికి రకరకాలుగా మద్దతిస్తూ, వారి గొంతుకగా నిలబడుతున్నటువంటి లోక్ సభ సభ్యుడి వ్యవహారాలు కూడా బయటకు వచ్చాయి.తక్షణమే ముందు జాగ్రత్త చర్యగా హైదరాబాద్, పాతబస్తీలో అక్రమంగా నివాసముంటున్న స్లీపర్ సెల్స్ ను ఏరిపారేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వారి రాజకీయ మైత్రి, అవకాశవాద మైత్రి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టేలా ఉండొద్దని తెలియజేస్తున్నాను.మరోవైపు బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల ఉత్సవాలు జరుపుకోవాలని తహతహలాడుతోంది.సమావేశాలు, సమీక్షలు, స్థల సందర్శనలు చేస్తూ.. ఏదో సాధించామన్నామట్లుగా ఆ ఉత్సవాలు జరుపుకోవాలని ఆలోచిస్తున్నారు.అసలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏం సాధించిందని ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటున్నారు..?రాజ్యం కొరకు ప్రారంభించిన పార్టీలో యువరాజు, యువరాజు కొడుకే ఉన్నట్లుగా గత పదేళ్ల పాలనలో అందరికీ అర్థమైంది. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చి ఫెయిల్యూర్ అని చూపించుకున్నారు.బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని ప్రకటించుకుని, ఆఖరుకు ఫెయిల్యూర్ అని ప్రూవ్ చేసుకున్నారు.రూలింగ్ లో ఉండి, ఆ తర్వాత ఇప్పుడు అపోజిషన్ లో ఉండి.. ప్రతిపక్ష నాయకుడు శాసనసభకు హాజరుకాకుండా ఫెయిలయ్యారు.నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల కోసమని చెప్పుకుని కేవలం పార్టీ నలుగురికే పరిమితమై ఫెయిలయ్యారు.కోటి కుటుంబాల తెలంగాణ అని ప్రారంభించిన ఉద్యమంలో ఒకే కుటుంబం కొరకు ఉన్నామని వ్యవహరించి ఫెయిలైంది ఈ బీఆర్ఎస్ పార్టీ.అసలు బీఆర్ఎస్ పార్టీ ఎవరి కోసం ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటోంది? యువరాజుకు పట్టం కట్టాలనా.. లేక యువరాణికి పట్టం కట్టాలనా..?ప్రతి కుంభకోణంలో బీఆర్ఎస్ పాత్రే ఉన్నది. విచారణ ఎదుర్కొంటోంది.. ఆరోపణలు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్ పార్టీయే. అన్ని కోణాల్లో అన్ని రంగాల్లో విఫలమైన బీఆర్ఎస్ పార్టీ... ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కూడా ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణను అన్ని రంగాల్లో పునర్నిర్మిస్తామని పదేపదే మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు.. కేవలం కుటుంబ నిర్మాణమే జరుపుకున్నారు.నీళ్లు, నిధులు, నియామకాల్లో కోటాలో ఫెయిల్.. వాటాలో ఫెయిల్.. భర్తీలో ఫెయిల్ గా మిగిలారు. అందరికోసమని చెప్పుకున్నవాళ్లు.. పార్టీని కొందరికే పరిమితం చేశారు. యువరాణి, యువరాజు అయితే.. అనేక కుంభకోణాల్లో కూరుకుపోయారు.ఖచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ జరుపుకోవాలనుకుంటున్న ఉత్సవాల తర్వాత సేనాధిపతి తిరుగుబాటు తప్పదు.మిషన్ కోసం ప్రారంభిస్తున్నామని చెప్పి.. కమిషన్ల పార్టీగా బీఆర్ఎస్ మిగిలిపోయింది. జాతీయ పార్టీ అని చెప్పుకున్న బీఆర్ఎస్ పార్టీ.. ప్రాంతీయ పార్టీగా ఫెయిలైంది. జాతీయ పార్టీగానూ ఫెయిలైంది.అన్ని నిర్ణయాలు, ఆలోచనల్లో ఘోరంగా ఫెయిలైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఉత్సవాలు జరుపుకునే అవకాశం, అర్హత లేదు.టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చారు. ఇక బీఆర్ఎస్ కు కేసీఆరే బీఆర్ఎస్ ఇస్తే మంచిది.

కీసరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కీసర, ఏప్రిల్ 25 : రైతులు పండించిన పంటలు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మండల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కీసర మండల కేంద్రంలో కీసర ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి సంవత్సరం కీసరలోని ప్రాథమిక సెంటర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తున్నామన్నారు. రైతులకు తమ సహకార సంఘం నుంచి సబ్సిడీ కింద విత్తనాల నుంచి మొదలు పెడితే పండించిన పంటలను కూడా కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకే ధాన్యాన్ని కొనగోలు చేస్తుందన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి : ఉపేందర్ గౌడ్

నల్గొండ, ఏప్రిల్ 25: ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఉపేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చేతులెత్తేసిందని విమర్శించారు. ఉద్యమ నేత కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రి చేయాలని అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నట్లు చెప్పారు.

కేసీఆర్ తోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని, దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా తదితర పథకాలతో రైతును రాజును చేసిన మహనీయుడు కేసీఆర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నేతృత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి వేలాదిమంది సభను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

తెలంగాణ ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ పుట్టింది: ఎమ్మెల్యే కేపీ వివేకానంద

హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ ప్రజల గొంతుగా బీఆర్ఎస్ పార్టీ పుట్టిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. అదే స్ఫూర్తితో గత పదేండ్లలో తెలంగాణను సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఈ నెల 27 వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరయ్యారు. పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కేపీ వివేకానంద మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనతోనే నీళ్లు, నిధులు, నియామకాల్లో జరుగుతున్న వివక్ష నుంచి తప్పించుకోవచ్చని, అప్పుడు అభివృద్ధి సాధ్యమని నమ్మి కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించారని తెలిపారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎన్నో అవమానాలను తట్టుకుంటూ తెలంగాణ వాణిని వినిపించారని అన్నారు. తెలంగాణ ప్రజల గొంతుకై పాలకులతో కొట్లాడి రాష్ట్రాన్ని సాధించిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. స్వరాష్ట్రాన్ని సాధించిన పదేండ్లలోనే అభివృద్ధి, సంక్షేమాలతో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేలా అందరం సమన్వయం చేసుకుంటూ బయలుదేరి వెళ్లి చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అమెరికా కోసమే దశాబ్దాలుగా ఈ దరిద్రపు పని

–పాక్ రక్షణ మంత్రి ఒప్పుకోలు

–ఉగ్రవాదులకు పాక్ నిధులు, శిక్షణ ఇచ్చింది

–ఈ తప్పిదం పాక్‌కు చేటు తెచ్చిందన్న మంత్రి ఖ్వాజా ఆసిఫ్

లండన్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పాశ్చాత్య దేశాల కోసం తమ దేశం ఉగ్రవాదుల సంస్థలకు దన్నుగా నిలుస్తున్నదని. శిక్షణ ఇస్తున్నదని, నిధులు సమకూరుస్తున్నదని పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అంగీకరించారు. ఈ తప్పిదం పాకిస్తాన్‌కు చేటు తెచ్చిందని ఆయన చెప్పారు. పహల్‌గామ్‌ల ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్తాన్ స్పందన, ఉగ్రవాదంపై వైఖరి గురించి స్కై న్యూస్‌కు ఇంటర్వ్యూలో పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్‌ను న్యూస్ ప్రెజెంటర్ యాల్దా హకీమ్ ప్రశ్నించారు. ఇటీవల పహల్‌గామ్‌లో ఉగ్ర దాడిలో 26 మంది వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. 'సార్, ఈ ఉగ్ర సంస్థలను సమర్థిస్తున్న, శిక్షణ, నిధులు ఇస్తున్న సుదీర్ఘ చరిత్ర పాకిస్తాన్‌కు ఉందని అంగీకరిస్తారా' అని హకీమ్ అడిగారు. 'నిజమే. మూడు దశాబ్దాలుగా యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్‌తో సహా పాశ్చాత్య దేశాల కోసం మేము ఈ దరిద్రపు పని సాగిస్తున్నాం' అని ఆసిఫ్ సమాధానం ఇచ్చారు. 'అది పొరపాటే. దాని వల్ల మేము నష్టపోయాం. అందుకు మీరు నాతో ఇలా అంటున్నారు. మేము సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా, ఇంకా 9/11 తరువాత యుద్ధంలో మేము చేరి ఉండకపోతే, పాకిస్తాన్‌దీ తిరుగులేని ట్రాక్ రికార్డు' అని ఆయన అన్నారు. 'ఈ ప్రాంతంలో ఏమి సంభవించినా పాకిస్తాన్‌ను నిందించడం అగ్ర రాజ్యాలకు ఎంతో సౌకర్యంగా ఉంటున్నది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా 19810 దశకంలో వారి పక్షాల పోరాడినప్పుడు, ఈనాటి ఈ

భారత్ - పాక్' యుద్ధం తప్పదా?

-భారత సుదర్శన్, సామాజిక రాజకీయ విశ్లేషకులు

హైదరాబాద్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రస్తుతం భారతదేశం మరియు పాకిస్తాన్ దేశాల మధ్య అనూహ్య పరిణామాలు ఉద్రిక్తతలు తీవ్రమైన స్థాయికి చేరుకున్నాయి. 2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" అనే ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించింది, ఇది పాకిస్తాన్ ఆధారిత లష్కరే తోయిబా అనుబంధంగా భావించబడుతోంది. ఈ హఠాత్ పరిణామాలతో భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించి, వెంటనే పాక్ పై కఠిన చర్యలను తీసుకుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్య మరియు దౌత్య సంబంధాల రద్దు చేసింది. పాకిస్తాన్ పౌరుల వీసాలను రద్దు చేసింది, ప్రధాన భూభాగ సరిహద్దును మూసివేసింది. సింధు జలాల ఒప్పందం నుండి ఉపసంహరణ ప్రకటించింది. పాకిస్తాన్ ప్రతిస్పందనగా భారతీయ విమానాలకు తన గగనతలాన్ని మూసివేసింది, వాణిజ్యాన్ని నిలిపివేసింది. సిమ్లా ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది.

సైనిక ఉద్రిక్తతలు :

లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్ఓసి) వద్ద భారత మరియు పాకిస్తాన్ సైనికులు పరస్పరం కాల్పులు జరిపారు. ఇప్పటివరకు ప్రాణనష్టం నివేదికలు లేవు. ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఇరు దేశాలను సంయమనం పాటించమని కోరుతున్నాయి. అమెరికా, రష్యా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ పరిణామాలను గమనిస్తున్నాయి.

యుద్ధం తప్పదా..:

ప్రస్తుత పరిస్థితులు 2019లో జరిగిన పుల్వామా దాడి తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతలను తలపిస్తున్నాయి. అయితే, ఇరు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉండటంతో, ప్రత్యక్ష యుద్ధం తీవ్ర పరిణామాలను కలిగించవచ్చు. అంతర్జాతీయ సమాజం ఇలాంటి పరిణామాలను నివారించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం భారతదేశ అమాయక ప్రజలు పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో చనిపోవడంతో యావత్ భారత సమాజం పాక్ పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తోంది. మెజార్టీ భారత దేశ ప్రజలు పాక్ పై యుద్ధం చేయాలని, దానికి తగిన గుణపాఠాన్ని చెప్పాలని కోరుకుంటున్నారు. దీంతో భారతదేశం మరియు పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అత్యంత తీవ్రమైన స్థాయికి చేరుకున్నాయి. అయితే, ప్రత్యక్ష యుద్ధం ప్రారంభమయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయి, ఎందుకంటే ఇరు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉండటంతో, అంతర్జాతీయ సమాజం కూడా ఇలాంటి పరిణామాలను నివారించేందుకు కృషి చేస్తోంది. పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు ఇరు దేశాలు సంయమనం పాటించడం అవసరమని భావిస్తున్నాయి.

ఈ తరుణంలో భారత ప్రభుత్వం పాక్ ను అంతర్జాతీయ స్థాయిలో మరింత ఏకాకిని చేయాలి. దానికి సహకరించే దేశాలతో వాణిజ్య పరమైన సంబంధాలను తగ్గించుకోవాలి. దౌత్య యుద్ధాన్ని ముమ్మరం చేయాలి. పాక్ ఆర్థిక మూలాల్ని పెకిలించి వేయాలి. తక్కువ ప్రత్యక్ష యుద్ధంతో, ఎక్కువ పరోక్ష యుద్ధాన్ని కొనసాగించాలి. బలమైన ఆర్థిక స్వావలంబనతో 'భారత్' ను శత్రు దుర్భేద్యంగా తీర్చిదిద్దాలి. భారత్ తో పెట్టుకోవాలంటేనే శత్రువులకు వెన్నులో వణుకుపుట్టేలా 'భారతీయుల ఆత్మ గౌరవ పతాక' ను ప్రపంచ యవనికపై ఎగురవేయాలి. జై భారత్!.

భూభారతి రైతుల బాధలను తీరుస్తుంది

- కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ గౌడ్

ఖమ్మం, ఏప్రిల్ 25 (నేటినిజం ప్రతినిధి) : భూసమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతుల భూములకు సంబంధించి దీర్ఘకాలంగా ఉన్న బాధలను,సమస్యలను తీరుస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన కొనిజర్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ...రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతాభావానికి తావు లేకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టం ద్వారా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్వోఆర్, మార్పులు, చేర్పులు సాదాబైనామా వంటి సేవలు సులభతరం అవుతాయని ఆయన అన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే గ్రామాల్లోని ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించే వేదిక భూభారతి అన్నారు. భవిష్యత్తులో భూములకు సంబంధించిన సర్వేలు చేసి భూముల కొలతలు హద్దులు, భూముల వివరాలను ఒకే పుస్తకంలో ఉండేలా ఆధార్ తరహాలో భూదార్ ను ప్రభుత్వం రూపొందించనున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం ద్వారా రైతుల భూములకు సంబంధించిన సమస్యలు సత్వరమే పరిష్కరించబడతాయన్నారు.

బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీకి అవకాశం కల్పించాలి

- కెసిఆర్ కు బహిరంగ లేఖ విడుదల చేసిన జాజుల

హైదరాబాద్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);టి ఆర్ ఎస్ పార్టీ 25

సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగాబిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీకి అవకాశం కల్పిస్తూ ఈనెల 27 న జరిగే వరంగల్ సభలో ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ వేదికగా ఆ పార్టీ అధ్యక్షులు కెసిఆర్ కు బహిరంగ లేఖ విడుదల చేసారు.

ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కసకాల శ్యామ్ కుర్మా, గౌడ జన హక్కుల పోరాట కమిటీ అధ్యక్షులు ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, కల్లుగీత సంఘాల కన్వీనర్ ఆయిలీ వెంకన్న గౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షులు దుర్గయ్య, నాగేష్ , బుర్ర సోమేశ్వర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు...

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు దండుగా తరలి రావాలి.. ఎమ్మెల్యే కృష్ణారావు పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 25: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. శుక్రవారం కూకట్‌పల్లి క్యాంప్ ఆఫీస్‌లో డివిజన్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ? తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ నినాదమైన ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రపంచ నలుమూలల చాటిచెప్పి.. దేశ పాలకులను మెప్పించి.. ఒప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ రజత ఉత్సవ పండుగకు ప్రజలు ఉవ్వెత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.

కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని దశాబ్ద కాలం పాలనలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన ఘనత తొలి సీఎం కేసీఆర్ దేనని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ.. డప్పు వాయిద్యాలతో తెలంగాణ జెండాలతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బహిరంగ సభకు భారీగా తరలి రావాలని కోరారు. డివిజన్ల వారిగా కోఆర్డినేటర్లు బస్సులను, తాగునీటిని, ఆహార వసతిని సమకూర్చాలని, రూట్ మ్యాప్‌ను వివరించి, ప్రజలను ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

దోమల నివారణకు జీహెచ్ఎంసీ చర్యలు.. గుర్రపు డెక్క తొలగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 25:దోమల నివారణకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. దోమల వృద్ధికి కారణమైన గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేందుకు సుదీర్ఘ ప్రణాళికతో పనులను ప్రారంభించింది. అత్తాపూర్ డివిజన్ నుంచి మలక్‌పేట మూసీకి ఇరువైపులా హిటాచీలతో గుర్రపు డెక్కను తొలగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.

గుర్రపు డెక్క తొలగించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు డ్రోన్ల సాయంతో యాంటీ లార్వాలను పిచికారి చేస్తున్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలో ప్రారంభమైన ఈ గుర్రపు డెక్క తొలగింపు పనులను రెండో బాలాజీ విభాగం అధికారి నామాల శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇటీవల దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ నల్లగొండ జిల్లా జైలు సందర్శన

నల్గొండ, ఏప్రిల్ 25:రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జైలును సందర్శించారు. జైలులోని అన్ని బ్యారక్స్ ను, వంట గదిని, ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలను, భోజనాన్ని అన్నింటిని పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలు ఉన్నట్లు తెలిపారు. జైలులో సౌకర్యాలన్నీ పరిశీలించడం జరిగిందని, నిబంధనల ప్రకారం ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ముఖ్యంగా ఖైదీలకు భోజనం, ఇతర సౌకర్యాలు బాగున్నట్లు తెలిపారు. ఖైదీల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. నియమ నిబంధనల ప్రకారం జిల్లా జైలును బాగా నిర్వహిస్తుండడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌కు జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ ఖైదీల వివరాలు, సౌకర్యాలు, ఏర్పాట్లు తదితర వివరాలను తెలియజేశారు. ఖైదీల సంక్షేమంలో భాగంగా వారి కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జైలు సూపరింటెండెంట్ వెంట జిల్లా జైలర్ బాలకృష్ణ ఉన్నారు. అంతకుముందు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌కు నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేశ్, డీఎస్పీ శివరామిరెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న సేవలు, సంక్షేమ హాస్టళ్ల ద్వారా అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళం

తిరుపతి, ఏప్రిల్ 25:హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ (వెటిరో టైల్స్) సంస్థ శుక్రవారం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు ఆ సంస్థ ప్రతినిధి బి.రమేష్ విరాళం డీడీని అందజేశారు.

మే నెలలో శ్రీ కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మే నెలలో విశేష ఉత్సవాల వివరాలను అధికారులు వెల్లడించారు. మే 3, 10, 17, 24, 31వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం , సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహణ ఉంటుందని తెలిపారు.

అనంతరం ఆలయంలో ఊంజల్‌సేవ జరుగనుందని అన్నారు.

మే 2న ఆలయంలో పుష్పయాగానికి అంకురార్పణ, 3న ఆలయంలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పుష్పయాగం, 12న పౌర్ణమి నాడు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహణ ఉంటుందని చెప్పారు.

ఈ సందర్భంగా సాయంత్రం శ్రీ సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు, 18న అన్నమాచార్య కళామందిరంలో ఆస్థానం, 22న హనుమజయంతి , 27న సహస్ర కలశాభిషేకం, 30న పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

కాలేజీ అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడి బ్లాక్‌మెయిల్.. ఇద్దరు అరెస్ట్

భోపాల్, ఏప్రిల్ 25: కొందరు వ్యక్తులు కాలేజీ అమ్మాయిలతో స్నేహం చేశారు. వారికి గిఫ్టులు ఇచ్చి ఆకట్టుకున్నారు. ఆ విద్యార్థినులపై అత్యాచారానికి పాల్పడ్డారు. రికార్డ్ చేసిన వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేశారు. మతం మారి తమను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. బాధిత విద్యార్థిని ఫిర్యాదుతో పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థినులతో ఇద్దరు యువకులు ఫ్రెండ్‌షిప్ చేశారు. ఆ తర్వాత వారిపై అత్యాచారానికి పాల్పడ్డారు. వీడియోలు రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. మతం మారి తమను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశారు.

కాగా, ఏప్రిల్ ఆరంభంలో 19 ఏళ్ల బాధిత యువతి దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితులైన ఫర్హాన్, సాహిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోక్సో, ఐటీ, బీఎస్ఎస్ చట్టంతోపాటు మధ్యప్రదేశ్ మత స్వేచ్ఛా చట్టంలోని సెక్షన్ల కింద మూడు కేసులు నమోదు చేశారు. మరోవైపు ఈ ముఠా ఇతర విద్యార్థులను కూడా టార్గెట్ చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే భయం, ఇతర కారణాలతో ఫిర్యాదు చేసేందుకు వారు ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ కే కస్తూరి రంగన్ మృతికి ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:భారత సైన్స్, విద్యా రంగాల్లో మహోన్నత వ్యక్తిగా పేరు గాంచిన డాక్టర్ కే కస్తూరి రంగన్ మృతికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సంతాపం వ్యక్తం చేశారు. అంకితభావంతో ఇస్రోకు సేవలందించిన డాక్టర్ కే కస్తూరి రంగన్, భారతీయ అంతరిక్ష రంగాన్ని నూతన శిఖరాలు అధిరోహించేలా చేశారని శ్రీ మోదీ అన్నారు. "జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ముసాయిదాను రూపొందించడంలో, దేశంలో అభ్యాసం సమగ్రంగా, భవిష్యత్తుకు తగినట్టుగా ఉండేలా డాక్టర్ కస్తూరి రంగన్ చేసిన కృషికి భారత్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుంది. ఎంతో మంది యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులకు ఆయన ఉత్తమ మార్గదర్శిగా ఉన్నారు"

"భారతీయ శాస్త్రీయ, విద్యా ప్రయాణంలో మహోన్నత వ్యక్తి డాక్టర్ కే కస్తూరి రంగన్ మరణం నన్ను కలచివేసింది. ఆయన దార్శనిక నాయకత్వం, నిస్వార్థమైన దేశ సేవ ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

అంకితభావంతో ఇస్రోకు సేవలందించి, భారత అంతరిక్ష రంగాన్ని నూతన శిఖరాలు అధిరోహించేలా చేశారు. ఈ అంశంలో మనకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. ఆయన నాయకత్వంలో పెద్ద సంఖ్యలో ఉపగ్రహ ప్రయోగాలు జరిగాయి. ఆవిష్కరణలపై దృష్టి సారించారు."

"జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ముసాయిదా రూపొందించడంలో, దేశంలో అభ్యాసం సమగ్రంగా, భవిష్యత్తుకు తగినట్టుగా ఉండేలా డాక్టర్ కస్తూరి రంగన్ చేసిన కృషికి భారత్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుంది. ఎంతో మంది యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులకు ఆయన ఉత్తమ మార్గదర్శిగా ఉన్నారు.

ఆయన కుటుంబం, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, అనంఖ్యాకమైన అభిమానులకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి"

రెనాల్ట్ భారతదేశంలో తన పరివర్తన వ్యూహాన్ని పునర్నిర్మించేందుకు కొత్త డిజైన్ సెంటర్‌ను ప్రారంభించింది

హైదరాబాద్, ఏప్రిల్ 25: రెనాల్ట్ ఇండియా, రెనాల్ట్ గ్రూప్‌కి పూర్తిగా చెందిన అనుబంధ సంస్థ, చెన్నైలోని రెనాల్ట్ డిజైన్ సెంటర్ ప్రారంభోత్సవంతో పాటు, భారతీకేంద్రీకృతమైన తన కొత్త పరివర్తన వ్యూహం 'renault. rethink ను ఆవిష్కరించింది. చెన్నైలో ఈ రోజు ప్రారంభించిన కొత్త రెనాల్ట్ డిజైన్ సెంటర్, ఈ పరివర్తనకు శుభారంభం చేకూర్చడంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, "మేక్ ఇన్ ఇండియా" ఫౌండేషన్‌కు అనుగుణంగా "డిజైన్ ఇన్ ఇండియా" అనే రెనాల్ట్ ఆశయాన్ని వేగవంతం చేయడంలో కూడా ప్రధాన భూమిక పోషిస్తుంది. ఇది ప్రత్యేకంగా RNTBCI (రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ & బిజినెస్ సెంటర్ ఇండియా) సమీపంలో ఉన్నందున, ఈ సెంటర్‌ను ఒక శ్రేష్ఠతా కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. "భారతదేశం ఎంతో ప్రత్యేకమైనదిగా, స్థానికంగా ప్రేరేపితమైనదిగా ఉంటుంది. దీని ప్రత్యేకతలను అర్థం చేసుకోవడానికి, అవసరాలను వినడానికి, బలాల నుంచి అభివృద్ధి చెందడం కోసం ప్రత్యేక డిజైన్ స్టూడియో ఉండటం అత్యవసరం. చెన్నైలోని రెనాల్ట్ డిజైన్ సెంటర్ భారత మార్కెట్‌కి అనుకూలమైన మోడల్స్ మరియు కాన్సెప్ట్‌లు అభివృద్ధిపై దృష్టి సారించడమే కాక, రెనాల్ట్ గ్రూప్ యొక్క గ్లోబల్ ప్రాజెక్టులకు కూడా పునాదిగా నిలుస్తుంది. స్థానిక ప్రతిభను మరియు లోతైన అంతరదృష్టిని వినియోగించుకోవడం ద్వారా, ఈ కేంద్రం రెనాల్ట్ భవిష్యత్ మొబిలిటీ పరిష్కారాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించనుంది. RNTBCI శ్రేష్ఠతా కేంద్ర హృదయంలో వ్యూహాత్మకంగా ఉండటం వలన, విభాగాల మధ్య గట్టి సహకారానికి, అలాగే డిజైన్‌ను ఇంజినీరింగ్ మరియు వినూత్న ప్రక్రియల్లో వేగంగా ఏకీకృతం చేయడానికి ఇది అనుకూలంగా మారుతుంది," అని మిస్టర్. లారెన్స్ వాన్ డెన్ అకర్, చీఫ్ డిజైన్ ఆఫీసర్, రెనాల్ట్ గ్రూప్ పేర్కొన్నారు. ఫ్రెంచ్ కార్మేకర్ రెనాల్ట్ ప్రకటించిన ప్రకారం, 2025 సంవత్సరం భారతదేశంలో కంపెనీకి ఒక మలుపుదిశగా నిలుస్తుంది. ఇది రెనాల్ట్ తదుపరి అడుగుకు బలమైన ఆధారస్తంభంగా మారుతూ, ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్ అయిన భారతదేశంలో తన లక్ష్యాలను సాధించడానికి మార్గాన్ని సృష్టిస్తుంది. ''renault. rethink వ్యూహం, భారత్‌లో రెనాల్ట్ తన కొత్త ప్రయాణాన్ని ఆవిష్కరించేందుకు మరియు ముందుకు నడిపించడం పట్ల దాని నిబద్ధతను సూచిస్తుంది. డిజైన్ ఆవిష్కరణ, సాంకేతిక పురోగతి మరియు లోతైన స్థానికీకరణలో కొత్త దృష్టితో బ్రాండ్ను తిరిగి కనుగొనడం, వినియోగదారులు మరియు వాటాదారులకు ఈ చొరవ ఒక ఆహ్వానంగా నిలుస్తుంది."ది లాంచ్ ఆఫ్ ది 'రెనాల్ట్. రీథింక్' వ్యూహం భారతదేశంలో రెనాల్ట్‌కు కొత్త శకానికి నాంది పలికింది. అతిపెద్ద ఖీడఆ సెంటర్, తయారీ యూనిట్, అత్యంత స్థానికీకరించిన సరఫరా గొలుసు మరియు ఇప్పుడు అతిపెద్ద డిజైన్ కేంద్రాలలో ఒకటైన యూరోపియన్ కార్ల తయారీదారులలో అత్యంత భారతీయుడిగా ఉన్నందుకు మేము గర్విస్తున్నాము. చెన్నైలో కొత్త డిజైన్ సెంటర్ ప్రారంభించడం రెనాల్ట్ ఇంటర్నేషనల్ గేమ్ ప్లాన్ 2027 విస్తరణలో కీలక పాత్ర పోషిస్తుంది.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

ఖమ్మం, ఏప్రిల్ 25: వేడి నీళ్లలో పడి తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారికి పాల్వంచ పట్టణానికి చెందిన "టీఎన్ఆర్ ట్రస్ట్" అధినేత తాండ్ర వెంకటేశ్వరరావు శుక్రవారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. కొత్తగూడెం పట్టణంలోని రామవరం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కళ్యాణ్ పాని, సబియానాజ్ దంపతుల నాలుగేళ్ల కుమార్తె క్రితిక ఈ ఏడాది జనవరిలో స్నానానికి తోడి ఉంచిన వేడి నీళ్ల బకెట్‌లో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి.

పాప చికిత్స కోసం ఇప్పటికే రూ.5 లక్షలు ఖర్చు అయింది. రెక్కాడితే డొక్కాడని ఆటో డ్రైవర్ కుటుంబం తమ పాపను రక్షించుకోవాలని అందినకాడికి అప్పులు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పాప చికిత్స కోసం దాతలు స్పందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకున్నారు. విషయం తెలుసుకున్న పాల్వంచ పట్టణానికి చెందిన టిఎన్ఆర్ ట్రస్ట్ అధినేత తాండ్ర వెంకటేశ్వరరావు రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ సభ్యుడు రామవరం పాప ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తాండ్ర బుచ్చిబాబు, తాండ్ర నాగబాబు, ములకలపల్లి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పుల్లారావు, మాజీ కౌన్సిలర్ తొగర రాజశేఖర్, తాండ్ర మణికంఠ, మారెడ్ల నరసింహారెడ్డి, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి,పోతురాజు విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో దయాకర్ రెడ్డి,మల్లిబాబు యాదవ్

ఖమ్మం, ఏప్రిల్ 25 (నేటినిజం ప్రతినిధి) :నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో యాదవులంతా భైరవునిపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో రాజకీయాలు వర్గాలకతీతంగా నూతనంగా గంగమ్మతల్లి గుడిని ఏర్పాటు చేసుకుని శుక్రవారం నాడు గంగమ్మ తల్లి, పోతురాజు విగ్రహప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ఖమ్మం క్యాంప్ ఆఫీస్ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి,జిల్లా అఖిలభారత యాదవ్ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్,

నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు యాదవ్ లు పాల్గొన్నారు. గ్రామం లోని యాదవులు ఘనస్వాగతం పలికి గంగమ్మతల్లి గుడిలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పాడి పంటలు పుష్కలంగా పండాలని, సమృద్ధిగా వానలు కురవాలని, ప్రజలందరికీ అవసరమైనప్పటికీ అనాదిగా కురుమ, యాదవులు మాత్రమే గంగమ్మ తల్లికి, పోతురాజుకు బోనాలతో మొక్కులు తీర్చుకొని సేవిస్తుంటారని, ప్రతి గ్రామంలో ఈ సాంప్రదాయం కలిగి ఉండటం చాలా గర్వకారణం అని పేర్కొన్నారు. వనభోజనాల సాంప్రదాయం కూడా శ్రీకృష్ణ పరమాత్మ కాలము నుండి కొనసాగటం చాలా గొప్ప సాంప్రదాయమని తెలిపారు. భైరవునిపల్లి గ్రామంలో ఇంటిలో నుండి బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా గుడి వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించారు. గ్రామం అంతా పండుగ వాతావరణంతో జాతరను తలపించింది, విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి ప్రతిష్ట చేయడం జరిగింది. పూజారులు జొన్నభట్ల ప్రసాద్ శాస్త్రి, నాగయ్య శాస్త్రి ఆధ్వర్యంలో యంత్ర స్థాపన, కళ్యాణం, విగ్రహప్రతిష్ట, దృష్టి కుంభం, పూర్ణాహుతి, మహాదాశీర్వచనం కార్యక్రమాలతో పాటు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మల్లెబోయిన శ్రీనివాస్, మల్లె బోయిన ఉపేందర్, చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య, కనకబండి కనకరాజు, బుర్ర వెంకన్న, బాలిన చిన్న నారాయణ, కనకబండి రమేష్, నూక చిన్న నాగయ్య, బొల్లం సత్యనారాయణ, కనక బండి సత్యనారాయణ, నూక సీతారాములు, కవిత, బొల్లం రామారావు, నూక వెంకటేశ్వరరావు, బుర్ర నాగభూషణం, బాలిన కోటయ్య, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, బంధువులు, మిత్రులు, తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ-కాశ్మీర్‌లో పహల్‌గామ్‌లో అమాయక పౌరులను

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:"కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ-కాశ్మీర్‌లోని పహల్‌గామ్ ప్రాంతంలో- ధార్మిక విశ్వాసమేదో చెప్పాలని అడిగి మరీ ఉగ్రవాదులు ఈ నెల 22వ తేదీన 28 మంది పౌరులను కాల్చివేసిన ఘటన పట్ల భార